



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

గురువారం 9 అక్టోబర్ 2025 పేజీలు 11




నేడే జెడ్పిటిసి, ఎంపిటిసి...

# ఎన్నికల నోటిఫికేషన్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08) ః రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ జారీకి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికా రులతో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మొదటి విడత జెడ్ పిటి సి, ఎంపిటిసి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ మాట్లాడు తూ... ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాకు సంబంధించి మొదటి విడతన ఈ నెల 9న 11, జడ్పిటిసిలు, 115 ఎంపీటీసీలకు సంబంధిం చిన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబం ధించి ఆర్వో, ఏఆర్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, పునఃచరణ శిక్షణ కూడా ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎఫ్ ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలను నియమించడం జరిగిందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధిం చిన రిపోర్టులను ఎప్పటికప్పుడు పంపించడం జరుగుతుంద ని, అలాగే నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పూర్తి సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు.అనంతరం ఎంపిడిఓలతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నామినేషన్‌ల ప్రక్రియపై పలు సూచనలు చేశారు.. నామినేషన్‌ల స్వీకరణలో ఎ ఒక్క అప్లికేషన్ కూడ రిజెక్టు కాకుండా చూసుకోవాలని, నియమ నిబంధనలు పాటించాలని, ఎలాంటి సమస్యలు ఏర్పడ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా నామినేషన్‌ల స్వీకరణ పై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్‌పి నారాయణ రెడ్డి, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, రెవిన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ జెడ్పి సీఈవో సుధీర్, డిపిఓ జయసుధ, ఆర్‌డిఓ వాసు చంద్ర, డిఎస్‌పిలు ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

పరిపాలన

# 'అసౌలభ్యం'..!


కొంగరకలాన్‌లోని జిల్లా కలెక్టరేట్



పద్మారావు నగర్‌లో తూనికలు కొలతల కార్యాలయం

రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08) : పరిపాలన సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లాలో పేరుకే ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్.. చెట్టుకోటి.. పుట్టకోటిగా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. కొత్త కలెక్టరేట్ కొంగర కలాన్‌లో నిర్మించినప్పటికీ... ఒకే గొడుగు కిందకు గవర్నమెంట్ ఆఫీసులు రావడం లేవు. కీలక శాఖలన్నీ బయటే ఉన్నాయి. ఏశాఖ ఎక్కడుందో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు. చిన్న చిన్న పనులకు కిలో మీటర్ల కొద్ది ప్రయాణం చేయాల్సి రావడంతో తిరిగి తిరిగి బేజారై చివరకు ఉసూరుమంటున్నారు.

**కీలక శాఖలన్నీ బయటే..**

మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో రంగారెడ్డి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, కూకట్‌పల్లిలో విద్యుత్ ఆర్ఆర్ జోన్ సీజీఎం కార్యాలయం, పద్మారావు నగర్‌లో తూనికలు కొలతల శాఖ, బేగంపేటలో పొల్యుషన్ కంట్రోల్ బోర్డు, సనత్ నగర్‌లో రోడ్డు భవనాలు, ఖైరతాబాద్‌లో నీటిపారుదలశాఖ, మాసబ్ ట్యాంక్‌లో పశుసంవర్ధకతో పాటు ఉపాధి కల్పన శాఖ కొనసాగుతున్నాయి. ఇవే కాకుండా నాంపల్లిలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, బీర్లామందిర్ వద్ద అటవీశాఖ, అబిడ్స్‌లో ఇంటర్మీడియట్ బోర్డు, అలాగే జిల్లా సహకార శాఖ, రాజజేంద్రనగర్‌లోని శివరాంపల్లిలో వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పరిషత్ లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలు కొనసాగుతున్నాయి. ఎల్బీనగర్‌లో మార్కెటింగ్ శాఖ, కొండాపూర్‌లో జిల్లా వైద్యవిధాన పరిషత్, రాజేంద్రనగర్‌లో డీసీఎంఎస్ కొనసాగుతుండగా జిల్లా కలెక్టరేట్ కొంగర కలాన్‌లో కొనసాగుతుంది. అక్కడ

మిగతా 2లో

- పేరుకే ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్
- చెట్టుకోటి.. పుట్టకోటిగా గవర్నమెంట్ ఆఫీసులు
- ఒకే గొడుగు కిందకు చేరని ప్రభుత్వ కార్యాలయాలు
- కొత్త కలెక్టరేట్‌లో కొన్నిశాఖలే.. కీలక శాఖలన్నీ బయటే
- ఏశాఖ ఎక్కడుందో తెలియక తికమకపడుతున్న ప్రజలు
- చిన్న చిన్న పనులకు కిలో మీటర్ల కొద్దీ ప్రయాణం
- తిరిగి తిరిగి ఉసూరుమంటున్న బాధితులు
- అస్తవ్యస్తంగా పరిపాలన వ్యవస్థ

## సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతా

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదనరెడ్డి



ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కలెక్టరేట్ గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాళ్ల అవసరాల కోసం కొంగరకలాన్‌లో కొత్త కలెక్టరేట్‌ను నిర్మించారు. అన్ని నియోజకవర్గాలకు మధ్యలో అందుబాటులో ఉండాల్సిన కలెక్టరేట్ కేవలం రెండు అసెంబ్లీ నియయోజకవర్గాలకు మాత్రమే అందుబాటులో ఉందనే విషయాన్ని జిల్లా ప్రజలు ఇప్పటికే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. బహుదూరంలో ఉన్న కలెక్టరేట్ కు రైతులు, సామాన్యులు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతా. కలెక్టరేట్‌కు రైతులు, ప్రజలు చేరుకునేలా అవసరమైనన్ని బస్సులను నడిపించేలా కృషి చేస్తా.



మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

| తొలివిడత ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు | |
|---|---|
| నామినేషన్ల స్వీకరణ | అక్టోబరు 09 |
| స్వీకరణకు చివరి తేది | అక్టోబరు 11 |
| పరిశీలన | అక్టోబరు 12 |
| ఉపసంహరణ | అక్టోబరు 15 |
| ఎన్నికల తేది | అక్టోబరు 23 |
| ఓట్ల లెక్కింపు | నవంబరు 11 |

| రెండో విడత ఎంపిటీసీ ఎన్నికలు | |
|---|---|
| నామినేషన్ల స్వీకరణ ప్రారంభం | అక్టోబరు 13 |
| చివరి తేది | అక్టోబరు 15 |
| పరిశీలన | అక్టోబరు 16 |
| ఉపసంహరణ | అక్టోబరు 19 |
| ఎన్నికల తేది | అక్టోబరు 27 |
| ఓట్ల లెక్కింపు | నవంబరు 11 |

# నామినేషన్లు షురూ..




రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08) : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నేడు గురు వారం యథావిధిగా నోటిఫికేషన్ విడు దల కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నేటి ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై విచారణ నేటికి వాయిదా పడినప్పటికీ, ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ కొనసాగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్ల ను తెలంగాణ హైకోర్టు బుధవారం విచారించింది. విచారణ సందర్భంగా సుదీర్ఘ వాదనలు జరిగినప్ప టికీ, తదుపరి విచారణను నేటి మధ్యాహ్నా 2.15 గంటలకు వాయిదా వేసినట్లు హైకోర్టు

మిగతా 2లో

- నేడు విడుదల కానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్
- తొలి విడతలో 10 జడ్పీటీసీలు, 110 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

## ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై
# అవగాహన అవసరం




- కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి
- పారదర్శకత, జవాబు దారీతనం పెంపు దిశగా చట్టం కీలక పాత్ర పోషిస్తోంది

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (అక్టోబర్, 08) : ప్రతి పౌరుడు సమాచార హక్కుచట్టం గురించి తెలుసుకుని, దాని ద్వారా తన హక్కులను వినియోగించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు సమాచారం అందించడం, ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకతను తీసుకురావడమేనని ఆయన అన్నారు. సమాచార హక్కు చట్టం-2005 వారోత్సవాల సందర్భంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధిక గుప్తాలతో పాటు

మిగతా 2లో

# పరిపాలన 'అసౌలభ్యం'.!

**మొదటిపేజీ తరువాయి...** ఒకటి.. ఇక్కడ ఒకటి ఆఫీసు ఉండటం.. జిల్లా అధికారులు ఎక్కడ ఉంటారో.. తెలియక బేజారు చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లా పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏ అధికారి కూడ అందుబాటులో ఉండటం లేదు. సోమవారం ఒక్కరోజు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి హాజరవుతున్నారు. మిగతా సమయాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ కేంద్రంగా 44 ఏళ్లు పాటు సాగిన పాలన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తన మేనమామ కొండా వెంకట రంగారెడ్డి పేరుతో 1978లో రంగారెడ్డి జిల్లాను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ కేంద్రంగా 44 ఏళ్లు పాటు పరిపాలన విజయవంతంగా సాగింది. రవాణా సౌకర్యం, ట్రైన్ సౌకర్యం అందుబాటులో ఉండటంతో నాడు లక్డికాపూల్‌లో జిల్లా కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రంగారెడ్డి జిల్లాలో 37 రెవెన్యూ మండలాలు ఉండేవి. లక్డికాపూల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజలతో నిత్యం రద్దీగా ఉండేది. రంగారెడ్డి జిల్లాలో పరిపాలన సాగించిన జిల్లా కలెక్టర్లు ఉన్నత శిఖరాలను అధిరోహించారు.

***2016లో కొత్త జిల్లాలు..***

2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన తర్వాత మొదటి సారిగా 2016 సంవత్సరంలో నూతన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల నిర్మాణం/పునర్వ్యస్థీకరణ చేశారు. జిల్లాల పునర్విభనలో రంగారెడ్డి జిల్లా మూడు జిల్లాలుగా రూపాంతరం చెందింది. (రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు), ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో 5 రెవెన్యూ డివిజన్లు, 27 మండలాలు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం ఉమ్మడి జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనాలు మంజూరు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్‌లో నాటి రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి పద్మారావు 2017 అక్టోబర్ 12వ తేదీన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు పూర్తి కావడానికి 5 సంవత్సరాలకు పైగా సమయం పట్టింది. 42 ఎకరాల విస్తీర్ణంలో రూ.58.20 కోట్ల వ్యయంతో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించారు. 2022 ఆగస్టు 25న అప్పటి సీఎం కేసీఆర్ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించా రు. ఎన్నో ఏళ్ల తర్వాత జిల్లాకు హెడ్‌క్వాటర్ ఏర్పడింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పాత జిల్లా కలెక్టరేట్ నుంచి కొత్త కలెక్టరేట్‌లోకి కొన్ని కార్యాలయాలు షిఫ్ట్ అయ్యాయి. కీలక శాఖలన్నీ ఇంకా బయటే ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కొత్త కలెక్టరేట్ నిర్మించినా ప్రయోజనం లేకుండా పోతుంది. అన్ని శాఖలు ఒకే చోట ఏర్పాటు చేస్తే.. ప్రజలకు మరింత సౌకర్య వంతంగా ఉండాలనే ఉద్దేశంతో సమీకృత కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. కానీ.. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కలెక్టరేట్ భవనం సరిపోవడం లేదు. అన్ని కార్యాలయాలు సమీకృతం భవనంలోకి రావాలంటే.. మరో రెండు అంతస్తులు కట్టాల్సిందేనంటున్నారు. ఇప్ప టికే వికారాబాద్, మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ శాఖలన్నీ కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. కానీ.. రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు నేటికి హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే కొనసాగుతున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ కార్యాల యాలు కొనసాగుతుండటం, జిల్లా కేంద్రానికి వాటిని తరలించే ఆలోచన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు లేకపోవడంపై గందరగోళం తలెత్తుతోంది. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కలెక్టరేట్‌లో అందు బాటులో ఉంటారని భావించి చాల మందికి ఇప్పటికీ కొంగరకలాన్‌కు చేరుకుంటున్నారు. తీరా ఆయా శాఖల అధికారులు అక్కడ లేరనే విషయం తెలిసి ఉసూరుమంటూ వెనుదిరుగు తున్నారు. చిన్న చిన్న పనులకు 40-60 కిలోమీటర్లు వెళుతున్నారు. వ్యయ ప్రయాసాలకోర్చి ఆఫీసులకు చేరుకుంటే తీరా సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవ డంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది.

***దూర'భారం'..!***

పరిపాలన సౌలభ్యం కోసం ఈ మార్పు చేసినప్పటికీ ఇది జిల్లా ఉద్యోగులకు, జనాలకు శాపంగా మారింది. లక్డీకాపూల్‌లో ఉన్న కలెక్టరేట్ కార్యాలయం వద్దే బస్‌స్టాప్, ఎంఎంటీఎస్, మెట్రోస్టేషన్లు అందుబాటులో ఉండేవి. కానీ ఇపుడు కొత్త కలెక్టరేట్‌కు వెళ్లాలంటూ చుక్కలు కనిపిస్తున్నాయి. వాహనాలు ఉన్న వారు తప్పా బస్సుల్లో వెళ్లే వారు నానా తంటాలు పడుతున్నారు. కొంగరకలాన్‌లోని కొత్త కలెక్టరేట్‌కు చేరుకోవాలంటే గగనంగా మారింది. ఔటర్ రింగురోడ్డు నుంచి కొన్ని కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. జనసంచారం కూడా అటువైపు పెద్దగా ఉండదు. ఉద్యోగులు తమ పరిస్థితిని ఉన్నతాధికారులకు విన్న వించడంతో అరకొర ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. ఉదయం, సాయంత్రం దిల్‌సుఖ్‌నగర్, జేబీఎస్, గచ్చిబౌలి, ఉప్పల్ నుంచి ఈ సర్వీసులు నడుపుతున్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన సుమారు 600 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారు. సాయంత్రం బస్సు మిస్ అయింది అంటే ఇక వారి ఇబ్బందులు వర్ణాతీతమే.

***టోల్ బాదుడు***

కలెక్టరేట్ కు చేరుకునేందుకు ఔటర్ రింగ్‌రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ.. టోల్ చార్జీ బాదుడు తప్పడం లేదు. రోజుకు రూ.120 టోల్ చెల్లించాల్సి వస్తుందంటున్నారు. దీంతోపాటు వేయి రూపాయల పెట్రోల్, డీజిల్ ఖర్చు తప్పడం లేదు. జిల్లా అధికారులకు జీతాలు ఎక్కువగానే ఉంటాయి.. పర్వా లేదు.. కానీ.. కారు లేని సిబ్బంది ఎలా చేరుకువాలన్నదే ప్రశ్నగా మారింది. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్, షాద్‌నగర్, నార్సింగి, రాజేంద్రనగర్, శంషాబాద్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ, ఆమనగల్లు కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి కొంగర కలాన్ కు చేరుకునేందుకు బస్సు సౌకర్యం లేదు. ఔటర్ రింగ్ రోడ్డు మీద బస్సులు, బైక్‌లకు అనుమతి లేదు. పూర్తి స్థాయిలో సర్వీసు రోడ్డు లేదు. ఎలా చేరుకోవాలని ప్రశ్నిస్తున్నారు. అన్ని మండల కేంద్రాలు, అన్ని బస్టేషన్‌ల నుంచి బస్సును నడిపించాలని కోరుతున్నారు.

***తొండుపల్లి శివారులో నిలిచిన సర్వీసు రోడ్డు పనులు***

గచ్చిబౌలి నుంచి రాజేంద్రనగర్ వరకు ఎడమ వైపు సర్వీసు రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడ నుంచి రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని హిమాయత్ సాగర్ వరకు అర కిలో మీటర్ వరకు కొండను తవ్వి రెండు వైపులా సర్వీసు రోడ్డు సౌకర్యం కల్పించారు. తర్వాత సర్వీసు రోడ్డు.. కిలో మీటర్ వరకు రోడ్డు కట్ అయ్యింది. మళ్లీ రెండు వైపులా ఆరు కిలో మీటర్ల వరకు సర్వీసు రోడ్డు సౌకర్యం వుంది. కానీ.. శంషాబాద్ మున్సిపాలిటీ నుంచి తొండుపల్లి శివారు ప్రాంతంలో రెండు వైపులా సర్వీసు రోడ్డు పనులు నిలిచిపోయాయి. సర్వీసు రోడ్డు కారణంగా భూములను కోల్పోయిన కొంత మంది భూ బాదితులు తమకు భూ పరిహారం అందలేని కోర్టును ఆశ్రయించారు. దీతో దశాబ్ద కాలంగా పనులు నిలిచిపోయాయి. సుమారు 4.5 కిలోమీటర్ల దూరం వరకు సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేస్తే.. నేరుగా కొంగర కలాన్ లోని కొత్త కలెక్టరేట్‌కు చేరుకునే సౌకర్యం ఉంటుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకుని సర్వీసు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా కృషి చేయాలని కోరుతున్నారు.



*శివరాంపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం*

***అప్పాజంక్షన్ నుంచి బస్సు నడిపించాలి..***

అప్పా జంక్షన్ , శంషాబాద్ నుంచి పావు గంటకు ఓ బస్సు వస్తే.. చేవెళ్ల, షాద్‌నగర్, రాజేంద్రనగర్, శేరిలింగపల్లి నియోజకవర్గ ప్రజలకు అధికారులకు సౌకర్యంగా ఉంటుందంటున్నారు. బస్సు సౌకర్యం కల్పించకుంటే.. కలెక్టరేట్‌ను పాత భవనంలోకి తిరిగి షిఫ్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగుల కోసం వస్తున్న నాలుగైదు బస్సులు అర్బన్ ప్రాంతాల వారికి ఉపయుక్తంగా ఉందని, కలెక్టరేట్ సిబ్బంది వెళ్లేందుకు అనుకూలంగా లేదంటున్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ పట్టించుకుని కలెక్టరేట్‌కు బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

---

# నామినేషన్లు షురూ..

**మొదటిపేజీ తరువాయి...** ప్రకటించింది. నేటి తీర్పు ఏవిధంగా ఉంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది. నేటినుంచి కొనసాగే నామినేషన్ల ప్రక్రి యకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మొదటి విడతలో ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఫస్ట్ విడతలో నేడు 10 జడ్పీటీసీలు, 110 ఎం పీటీసీ స్థానాల్లో నోటిఫి కేషన్ విడుదల చేయనున్నా రు. ఇందులో చేవెళ్ల డివిజన్‌లో 4 మండలాలు, కందుకూరు డివిజన్‌లో 5 మండలాల్లో, రాజేంద్ర నగర్ డివిజన్‌లో శంషాబాద్ జడ్పీటీసీకి ఎ న్నికలు జరగను న్నాయి. నామినేషన్ ప్రక్రియ కొనసాగే ఎంపిడీవో కార్యాలయాల్లో ఏర్పా ట్లు పూర్తి చేశారు. సెకండర్ విడతలో ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నేటినుంచి 11వ తేది వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. తొలి విడతలో నామి నేషన్ వేయనున్న అభ్యర్థులకు కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో నామినేషన్ వేసేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. పార్టీల బీ-ఫాం కోసం ఎదురు చూస్తున్నారు. బీ-ఫాం ఎవరికి వస్తుందోనన్న ఉత్కంఠ అభ్యర్థుల్లో నెలకొంది. జిల్లాలో 21 జడ్పీటీసీ స్థానాలు ఉండగా ఇందులో మహిళలకు 9 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. ఎస్టీలకు 3, ఎస్సీలకు 4, బీసీలకు 9, జన రల్ 5 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. ఎస్సీలకు కేటాయించిన 4 స్థానాల్లో శంకర్‌పల్లి, చేవెళ్ల ఎస్సీ జనరల్ కాగా షాబాద్, కందుకూరు జడ్పీటీసీ స్థానాలు ఎస్సీ మహిళలకు రిజర్వ్ అయ్యాయి. షాబాద్, కందుకూరు స్థానాల్లో గెలిచిన మహిళా జడ్పీటీసీలు జడ్పీ స్థానాలకు దక్కే అవకాశాలు ఉన్నప్పటికీ.. చేవెళ్ల, శంకర్‌పల్లి జడ్పీటీసీ స్థానాల్లో నేతలు వారి సతులను ఎన్నికల బరిలో నిలిపేందుకు పావులు కదుపుతున్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియ మావళిని పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మొదటి విడత జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అక్టోబరు 23న పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు నవంబరు 11న జరగనుంది.

---

ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై

# అవగాహన అవసరం

**మొదటిపేజీ తరువాయి...** కలెక్టర్ మను చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... "సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి ఇరవై సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాం" అని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఎపిఐఓ (సహాయక ప్రజా సమాచార అధికారి), పిఐఓ (ప్రజా సమాచార అధికారి), అప్పీలేట్ అధికారిలను నియమించి, ప్రజల దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. "ప్రతి శాఖ చేసే పనులు ప్రజలకు తెలియాలి. దీనివల్ల పారదర్శకత పెరుగుతుంది, అవినీతి తగ్గు తుంది. సమాచార హక్కు చట్టం జవాబుదారీతనాన్ని పెంచి, బాధ్యతాయుత పరిపాలనకు దోహదం చేస్తుంది,"అని కలెక్టర్ పేర్కొన్నారు. తిరస్కరణలకు కూడా కారణాలు తెలపాలని, దరఖాస్తుదారులతో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఎపిఐఓ, పిఐఓలు అవసరమైన మార్గనిర్దేశం చేస్తూ ప్రజలకు సహకరించాలన్నారు. తరువాత జిల్లా కోఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంలోని ముఖ్య అంశాలను వివరించారు. చట్టంపై ప్రజల సందేహాలకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జె.ఎల్.బీ హరిప్రియ, ఎ.ఓ.రామ్మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎపిఐఓ, పిఐఓలు తదితరులు పాల్గొన్నారు.

---

# 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

- జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగొద్దు
- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): ఈ సారి 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో 2025-26 వానాకాలం ధాన్యం కొనుగోలుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దని తెలిపారు. జిల్లాలో 33 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పీఏసీఎస్-ఐకేపీ ద్వారా 3, పీఏసీఎస్ ద్వారా 23, డీసీఎంఎస్ ద్వారా 7 కేంద్రాలను ఓపెన్ చేసేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సీజన్‌లో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇందులో సన్నరకం 15 వేలు, దొడ్డురకం 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అంచనా వేసినట్లు చెప్పారు. క్వింటాలు ధాన్యం గ్రేడ్-ఎ రకానికి రూ.2389, కామన్ రకానికి క్వింటాలుకు రూ.2369, సన్నరకం వరి ధాన్యంకు కింటాలుపై రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. సన్నరకం, దొడ్డురకం వరి సేకరణకు వేర్వేరుగా కేంద్రాలను తెరవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలకు, కంట్రోల్ రూమ్ నెంబర్‌లకు సంబంధించిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మార్కెటింగ్ కొనుగోలు కేంద్రాలకు సరిపడా పాడి క్లీనర్స్, మాయిస్టర్ మీటర్స్, వేయింగ్ స్కేల్స్, గ్రేన్ కాలిపర్స్, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. 2.5 ఎంఎం కంటే ఎక్కువ పొడవున్న, వెడల్పు నిష్పత్తిని కొలవడానికి గ్రయిన్ కాలిపర్ పరికరాలను ఉపయోగించడం ద్వారా పీపీసీల వద్ద రైతులు తీసుకువచ్చే వరి రకాల నాణ్యతను ధృవీకరించాలని తెలిపారు. ధృవీకరణ పొందిన తర్వాత పీపీసీ ఇంచార్జీలు వరి వివరాలను ఓపీఎంఎస్‌లో నమోదు, ట్యాగ్ చేసి మిల్లులకు తరలించాలని ఆయన తెలిపారు. మిల్లులకు పంపే ముందు పిపిసి ఇంచార్జీలు కొత్త గన్నీ బ్యాగులపై 'ఎస్' అక్షరాన్ని గుర్తుపెట్టి, సన్నరకం రకానికి 'రెడ్' కలర్ దారంతో బ్యాగులను కుట్టడం ద్వారా సులువుగా గుర్తించేందుకు వీలుంటుందని చెప్పారు. దొడ్డురకం ధాన్యంకు 'ఆకుపచ్చ' రంగు దారం తప్పనిసరి అని చెప్పారు. ఓపీఎంఎస్‌లో అదే రోజు వివరాలు, చెల్లింపు కోసం డీఎంసీఎస్‌కు వెంటనే సమర్పించాలన్నారు. 72 గంటల్లోపు ఏదైనా నాణ్యత సంబంధిత సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడం జరుగుతుందని, అన్ని పిపిసి ఇంచార్జీలు ఊహించని వర్షాలు ఏమైనా ఉంటే వాటిని తెలుసుకునేందుకు వాతావరణ యాప్'ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్తయ్ మేనేజర్ జె. హరీష్, డీసీఎస్‌వో వనజాత, డీఆర్‌డీవో పీడి శ్రీలత, డీసీవో సి. సుధాకర్, జిల్లా వ్యవసాయాధికారి డి. ఉష, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజ్, డీఎల్‌ఎమ్‌వో పి. శ్రీనివాస్‌రెడ్డి, రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు, సీఎస్‌లు, డీటీలు, ఏడీలు, ఏపీఎంలు, పీఏసీఎస్, డీసీఎంఎస్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఫిర్జాదిగూడలో చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ పరిశీలన

**● అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**
**● తడి, పొడి చెత్త వేరు చేసి పునర్వినియోగం ● కాలుష్యం నివారణకు ఈ ప్రయత్నం దోహదం చేస్తుంది**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్, 8): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫిర్జాదిగూడలోని చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఐఏఎస్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఐఏఎస్ లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్లాంట్‌లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ప్రాసెసింగ్ చేసే విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. తడి చెత్తలో ఉండే ఆహార వ్యర్థాలు, తోట వ్యర్థాలు వంటి జీవ పదార్థాలను కంపోస్టింగ్ ద్వారా సేంద్రీయ ఎరువుగా మార్చవచ్చని, అవసరమైతే బయోగ్యాస్ ఉత్పత్తికి కూడా ఉపయోగించవచ్చని తెలిపారు. అలాగే పొడి చెత్తలోని ప్లాస్టిక్, కాగితం, గాజు, లోహాలు వంటి పునర్వినియోగ పదార్థాలను ఎలా రీసైక్లింగ్ చేస్తున్నారో ప్రత్యక్షంగా గమనించారు. ఈ విధమైన చర్యలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, వనరుల సమర్థవంతమైన వినియోగానికి దోహదం చేస్తాయని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పేర్కొన్నారు. అదనంగా ఆమె అధికారులు, మున్సిపల్ సిబ్బందిని మరింత సమర్థవంతమైన చెత్త నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, ప్రజల్లో విభజిత చెత్త సేకరణపై అవగాహన పెంపొందించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఫిర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వరరావు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# కూకట్పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శించిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**... పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్షన్**
**- సపోర్టివ్ సూపర్వైజర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని పరిశీలన**





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (అక్టోబర్, 8):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా బుధవారం కూకట్పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భనలో ఆమెతో పాటు జిల్లా విద్యాధికారి ఐ.విజయ కుమారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పరీక్షా సిద్ధత, భవిష్యత్ లక్ష్యాలు మరియు కెరీర్ మార్గదర్శనం వంటి అంశాలపై వారితో చర్చించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ ప్రతిభను నిరూపించుకోవాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆమె ప్రోత్సహించారు. తరువాత సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సపోర్టివ్ సూపర్వైజర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు (ఎంఈఓలు) మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలలలో విద్యా ప్రమాణాల మెరుగుదల, బోధనా పద్ధతుల నాణ్యత పెంపు, విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ పొందుతున్నారు.

ఈ సందర్భంగా రాధిక గుప్తా మాట్లాడుతూ,.. విద్యా నాణ్యతను పెంచడంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు కీలక పాత్ర వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో అభ్యాస ఆసక్తిని పెంపొందించే సృజనాత్మక బోధన పద్ధతులను అవలంబించాలన్నారు. పాఠశాలల్లో పాజిటివ్ లెర్నింగ్ వాతావరణం సృష్టించడం ద్వారా విద్యార్థుల ఆత్మవిశ్వాసం, ప్రతిభ పెంపొందుతుందని తెలిపారు.

# ప్రయాణికులకు నిత్య ప్రాణ గండంగా మారిన మూడుచింతలపల్లి

**● కీసర ప్రధాన రోడ్డు**
**● ప్రజల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు**
**● ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు**

**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):**
మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని మూడుచింతలపల్లి-కీసర ప్రధాన రహదారి ప్రయాణికులకు నిత్య ప్రాణ గండంగా మారింది. శాలవాని కుంట నుంచి లీకవుతున్న నీరు రోడ్డుపై నిల్వై, పెద్ద గుంతలు ఏర్పడి చెరువులా మారాయి. ఫలితంగా రోడ్డు ఎక్కడుందో, గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి బాధ్యత వహించాల్సిన ఆర్అండ్‌బి, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు మాత్రం తమ పరిధి కాదంటూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తరచూ గుంతల్లో పడి గాయాల పాలవుతున్నప్పటికీ, అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విచిత్రమేమిటంటే, ఇదే రహదారిపై సంబంధిత అధికారులు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, రోడ్డు దుస్థితి వారిని ఏమాత్రం కదల్చడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. అంతేకాక, దీని సమీపంలో ఉన్న వైన్స్ షాప్ వల్ల రాత్రి వేళల్లో మద్యం సేవించి వెళ్లే వారికి ప్రమాదం ఏ క్షణానైనా సంభవించవచ్చని, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులు తెలుపుతూ,..“ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోతే, జిల్లా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం” అని హెచ్చరించారు.

# చెరువుకట్ట ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

**● రాజ బొల్లారం గ్రామస్తులు ● చెరువులో నీరు నిలవకుండా కట్టను తొలగిస్తున్నారంటూ ఆరోపణలు**



**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):**
నిజాం కాలంలో నిర్మించిన గొలుసు కట్టు చెరువుకట్టను ధ్వంసం చేస్తూ చెరువులో నీరు నిలవకుండా చేస్తున్నారంటూ రాజ బొల్లారం గ్రామస్థులు బుధవారం మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని బంధం కుంట చెరువు గ్రామ ప్రజల సాగునీటి ప్రధాన వనరుగా ఉపయోగపడుతోంది. అయితే, వివేక్ రెడ్డి అనే వ్యక్తి జెసిబి యంత్రాలతో చెరువుకట్టను తొలగించి, మట్టిని అక్రమంగా విక్రయిస్తూ, పైప్‌లైన్‌ల ద్వారా చెరువులోని నీటిని బయటకు మళ్లిస్తున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. బండరాళ్లను మందుగుండు సహాయంతో పేల్చివేయడం వల్ల చెరువుకట్ట ఉనికే ప్రమాదంలో ఉందని, తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.ఈ ఘటనపై స్పందించిన మేడ్చల్ మండల తాసిల్దార్ భూపాల్ మాట్లాడుతూ,.. “చెరువు వద్ద క్షేత్రస్థాయి పరిశీలన చేసి, పనులను నిలిపివేసి, వాహనాలను సీజ్ చేస్తాము. ఇరిగేషన్ అధికారులకు లేఖ రాసి నిందితులపై చర్యలు తీసుకుంటాము” అని తెలిపారు.

# తూముకుంట 7వ వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

**● మాజీ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి నాగేష్ యాదవ్**
**● ద్వారకాపురి, సాయినగర్ కాలనీల్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు త్వరలో ప్రారంభం**



**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):**
మేడ్చల్ జిల్లా తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి నాగేష్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ,... “మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి సహకారంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో 7వ వార్డు పరిధిలోని ద్వారకాపురి కాలనీ, సాయినగర్ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి,” అని వివరించారు. కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారం కోసం కృషి చేస్తానని, ప్రజల సౌకర్యం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని మాజీ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి నాగేష్ యాదవ్ భరోసా ఇచ్చారు.

**డాక్యుమెంట్లు పోయినది**
నేను MD రఫీ S/o MD జక్రియా, వయస్సు సుమారు 56 సంవత్సరాలు, ఇంటి నెం: 103, మొగల్ మిలీనియం ఏప్రిల్, బర్కత్‌పురా, హైదరాబాద్. నా అసలు డాక్యుమెంట్ ఓపెన్ ప్లాట్ నెం: 93, 94,95,194, 195,196,197 & 198 ను పోగొట్టుకున్నాను, ఇది రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, నాగిరెడ్డిపల్లి గ్రామంలో 4000 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న సర్వే నం: 74 & 75 లో ఉంది. 08-09-2025న నా అసలు డాక్యుమెంట్ ఓపెన్ ప్లాట్ నెం: 7679/2006, రిజిస్ట్రేషన్ తేదీ: 24-05-2006న తీసుకెళ్లాను. పైన పేర్కొన్న డాక్యుమెంట్లను పోగొట్టుకున్నానని, వాటిని కనిపెట్టడానికి అన్ని ప్రయత్నాలు చేశానని, కానీ ఫలించలేదని మరియు కోల్పోయినది తిరిగి పొందలేని విధంగా ఉందని గమనించాను. ఎవరికైనా దొరికితే దయచేసి సంప్రదించండి: 9948288654.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కహామీ అమలు కాలేదు

▶▶ గత బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలే ప్రజలకు లబ్ది ▶▶ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ▶▶ మీర్‌ఖాన్‌పేట్‌లో గడప గడపకు కాంగ్రెస్ బాకీ కార్డు



కందుకూరు, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలలు గడుస్తున్న ఇచ్చిన 420 హామీలలో ఏ ఒక్క హామీ అమలు కాలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మీర్‌ఖాన్‌పేట్‌లో గడపగడపకు కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా సబితారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ గత ప్రభుత్వ పథకాలే నేటి లబ్ది పొందుతున్నారని ఇచ్చిన హామీ ఒక్కటి నెరవేర్చ లేదని అన్నారు. బతుకమ్మ చీరలు పంపిణీ చేయలేదని గతంలో ఇచ్చిన చీరలతో స్వాగతం పలికారని, దళిత బంధు పొందిన కుటుంబాలకు నెలకు వెయ్యి రూపాయలు పొందుతున్నారని తెలిపారు. ★మెడిల్ కాలేజీ ఎక్కడ :గత రెండు మూడు రోజుల కిందట ప్రారంభించిన ఫ్యూచర్ సిటి ప్రక్కన మహేశ్వరం మెడికల్ కాలేజీ ఎక్కడకి వెళ్లిందని ఆమె ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 75 శాతం పూర్తి అయిన ఫార్మాసిటీ రోడ్డు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో అసంపూర్తిగా ఉండి పోయిందని, ఫోర్త్ సిటీలో భాగమైన రోడ్డును ఎందుకు పూర్తి చేయలేక పోతున్నారని అడిగారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజలు గట్టి బుద్ది చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మన్నే జయేందర్ ముదిరాజ్ , పాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి,లక్ష్మీనర్సింహారెడ్డి, తాజామాజీ సర్పంచ్ జ్యోతి చంద్రశేఖర్, ఎంపీటీసీలు రాములు, రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబి డైరెక్టర్ పొట్టి ఆనంద్, మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరదేవేందర్, మేఘనాథ్‌రెడ్డి,లచ్యానాయక్, తాళ్ల కార్తిక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పారిజాతం, దేవిలాల్ నాయక్, గొర్రెంకల రామకృష్ణ, దామోదర్ గౌడ్, సామయ్య, శివప్రసాద్ చారీ, పరంజ్యోతి, నర్సింహ, జంగయ్య, బాలకృష్ణ, దర్శన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, జైపాల్, వేణు, అంజయ్య, వెంకటేష్, అఖిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కెఎల్ఆర్



మహేశ్వరం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): బిజెపి ప్రభుత్వం అట్టడుగు వర్గాల ఓట్లను చోరీ చేస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఆరోపించారుఓట్ల దొంగతనం చేస్తూ... ఓట్ చోరీపై ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోనిఅమీర్ పేటలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతుందని మరోసారి ఆరోపించారు.రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లను బీజేపీ కేంద్ర సర్కార్ అణిచివేస్తుందని ఆరోపించారు.బీజేపీకి సపోర్ట్ చేయకుంటే అర్హుల ఓట్లను సైతం బీజేపీ తొలగిస్తుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధినాయకత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఓటు చోరీపై పై సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు.అంతకు ముందు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ ఉద్యమాన్ని గడపగడపకు తీసుకెళ్లేందుకు ప్రతీ కాంగ్రెస్ సైనికుడు, మహిళా విభాగం నేతలు, నాయకులు కృషి చేయాలని కేఎల్ఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య యూత్ అధ్యక్షులు రాజు గొల్లూరి, కాకి ఈశ్వర్ , రాజు నాయక్ ,శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి పౌండేషన్లు ముందుకు రావడం అభినందనీయం









శంకర్పల్లి మేజర్ న్యూస్ (అక్టోబర్ 8) ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ఫౌండేషన్లు ముందుకు రావడం అభినందనీయమని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్ర రావు అన్నారు. బుధవారం రోజున శంకర్ పల్లి లోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం ను కే ఎన్ ఏ ఫౌండేషన్ వారు రూపాయలు 6,00,000 లతో ఏర్పాటుచేసిన నూతన గది నిర్మాణము, మరమ్మత్తు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎన్ఏ ఫౌండేషన్ వారు విద్యార్థుల కోసం నూతన గతి, టాయిలెట్లు, విద్యుత్ మరమ్మత్తులు చేయించడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వంతోపాటు, ఫౌండేషన్లు, ప్రైవేటు వ్యక్తులు పేద విద్యార్థుల కోసం, వారి భవిష్యత్తు కోసం ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడాలని అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రైవేటు విద్యా సంస్థలతో, ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు.కె ఎన్ ఏ ఫౌండేషన్ వారు రాబోయే కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నార్సింగ్ ఏసిపి రమణ గౌడ్, ఎండిఓ వెంకయ్య గౌడ్, తాసిల్దార్ సురేందర్, ఎంఈఓ అక్బర్, సీ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు తాహేర్ అలీ, ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుల్తానా, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీ, సీనియర్ పాత్రికేయులు సలీం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సరళ, ఉపాధ్యాయులు ఆర్షియా, ధనలక్ష్మి, సాలేహా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో తనిఖీ ముమ్మరం చేసిన పోలీసులు



మొయినాబాద్ మేజర్ న్యూస్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో బుధవారం పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని హైకోర్టులో దాఖలైన పిటిషన్ బుధవారం విచారణ జరిగి ఈరోజు 2 గంటల 15 నిమిషాలకు తీర్పు వెలబడుతుందని నేపథ్యంలో తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి తీర్పు అనుకూలంగా వస్తుంది అని వాదనలు వినిపిస్తున్న తరుణంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల కోలాహలం కనిపిస్తుంది కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ నాయకులు ఎంపీటీసీ, జెడ్పిటిసి సర్పంచ్ అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యారు కొన్ని గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు ముమ్మరం కావడంతో మండల కేంద్రంలోని సంబంధిత అధికారులు పోలీసు యంత్రాంగం అప్రమత్తమయింది దానిలో భాగంగా సర్పంచ్ జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సీఐ పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేసి పరిశీలిస్తున్నారు సీఐ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్కరు మద్యం గాని డబ్బులు గానీ తరలిస్తే అలాంటి వాహనాలు సీచేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందని సిఐ పవన్ కుమార్ రెడ్డి హెచ్చరించారు

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

–డీఆర్‌డీఏ జిల్లా పీడీ వెంకటరమణ



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సంఘాలు ఉపయోగపడుతాయని డీఆర్‌డీఏ రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ తెలిపారు.చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో మెప్మా మహిళల సంఘాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చేవెళ్ల మున్సిపాలిటీ ఏర్పడిన నేపథ్యంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సంఘాలను మెప్మా పరిధికి అనుసంధానం చేసేందుకు సమావేశం చేపట్టినట్లు తెలిపారు. మహిళల కార్యకలాపాలు, నగర పేదరిక నిర్మూలన కార్యక్రమాల పురోగతిపై వివరంగా చర్చించారు. మహిళలు అర్థికాభివృద్ది సాధించినప్పుడే దేశం అభివృద్ది చెందుతుందన్నారు. కుటుంబాభివృద్దిలో మహిళలు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈసమావేశంలో కమిషనర్ వెంకటేశం, జిల్లా కమిటీ కోఆర్డినేటర్ ఇందిరా, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అంబేద్కర్ భవనం పూర్తి నిర్మాణానికి ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ మేయర్ సహకారము



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08)బండ్లగూడ జాగీర్ మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అసోసియేషన్ అధ్యక్షుడు చరణ్ బాబీ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి త్వరగా. ఆయన అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు చరణ్ తో కలిసి బుధవారం భవన నిర్మాణాన్ని పూర్తి చేయుటకు తగిన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కోరారు. ఎమ్మెల్యే వెంటనే స్పంధించి అంబేద్కర్ భవన్ నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేసి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని బి జె ఎం సి కమిషనర్ శరత్ చంద్ర ఆదేశాలు జారీ చేశారు. దీంతో అంబేద్కర్ అసోసియేషన్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి, మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాహుల్, అసోసియేషన్ సభ్యులు, గౌతమ్ రాజ్, అవినాష్, ప్రదీప్ , అభిషేక తదితరులు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి

★ఎంఈఓ కు వినతి పత్రం అందించిన ఏబీవీపీ విద్యార్థులు



మహేశ్వరం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): మహేశ్వరం మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏబీవీపీ విద్యార్థులు బుధవారం ఎంఈఓ కసనా నాయక్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ... మండల కేంద్రంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో కొన్ని రోజులుగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందలేకపోతున్నారని, విద్యార్థులపై ప్రతికూల ప్రభావితం చేస్తుందని అన్నారు. దీనితో విద్యా కార్యకలాపాలు దెబ్బ తినడమే కాకుండా విద్యార్థుల అభ్యసనంపై ప్రభావం ఏర్పడుతుందని పిల్లలకు నిరంతరాయంగా విద్యను అందిస్తేనే వారు ప్రయోజకులు అవుతారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వ బాలికల పాఠశాలకు ఉపాధ్యాయుని నియమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు ప్రణీత్, నిమేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి..

# దేశ న్యాయవ్యవస్థపై దాడే...

**జాతీయ మాల మహానాడు మేడ్చల్**

**మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం**

**కీసర,మేజర్ న్యూస్(అక్టోబర్ 08):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం అంటే దేశ న్యాయవ్యవస్థ పైన, భారత రాజ్యాంగం పైన దాడి చేసినట్లే అని జాతీయ మాల మహానాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం అన్నారు. భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) గవాయి పై ఒక న్యాయవాది రాకేష్ కిషోర్ దాడికి యత్నించడం పట్ల తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన ఆయన మతోన్మాదుల దాడిగా అభివర్ణిస్తూ భారత రాజ్యాంగ వ్యవస్థకు భంగం కలిగించే ఇలాంటి చర్యను కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని పేర్కొన్నారు. న్యాయ వాద వృత్తిలో ఉన్న ఒక వ్యక్తి దేశ అత్యున్నత న్యాయస్థానం గౌరవానికి భంగం కలిగించే విధంగా సిజెఐ గవాయి పై షూ తో దాడికి ప్రయత్నించడం అత్యంత హేయమైన చర్య అని గుజ్జుక పరశురాం మండిపడ్డారు. ఈ సంఘటన దేశంలో ని దళితుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని, గాయపరిచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిజెఐ గవాయి పై దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ లాయర్ పై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే ఆ న్యాయవాదిని న్యాయవృత్తి నుంచి శాశ్వతంగా తొలగించాలని ఆయన కోరారు.



బిజెపి పాలిత రాష్ట్రాలలో మతోన్మాదాన్ని నెత్తికెక్కించు కొని కొంతమంది రౌడీలుగా, గుండాలుగా మారి చట్టాన్ని చేతిలోకి తీసుకొని దళితులపై అనేక రకాలుగా దాడులకు, అఘాయిత్యాలకు పాల్ప డుతున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరగవద్దంటే ఈ దాడికి పాల్పడిన వ్యక్తిని అతని వెనుక ఉన్న కుట్ర దారులను విచారణ జరిపి ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ తీవ్రమైన సంఘటనకు నైతిక బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వంలోని న్యాయ శాఖ మంత్రి మరియు హోం మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో న్యాయమూర్తులకు రక్షణ లేకపోవడం ప్రభుత్వాల వైఫల్యమేనని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఈ విషయంపై స్పందించి దళితుల మనోభావాలను కాపాడాలి జాతీయ మాల మహానాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం డిమాండ్ చేశారు.

# బీజేపీ పాలనలోనే దళితులపై దాడులు అధికం

**● ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల జీవనం దుర్భరం ● యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి యం.కృష్ణంరాజు**

**కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 8):** బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో దళితులపై దాడులు అధికమయ్యాయని, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల జీవనం దుర్భరమైందని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి యం.కృష్ణంరాజు ఆరోపించారు. జాతీయ యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు బుధవారం కొడంగల్‌లో ఐలవ్ అంబేద్కర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గాంధీనగర్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, అంబేద్కర్ వాదులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడులకు ప్రయత్నించడం లాంటి సంఘటనలు చూస్తుంటే ప్రధాని మోదీ పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. దేశ సంపదను ప్రధాని నరేంద్రమోదీ కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అధికార దాహంతో ఓట్ల చోరితో గద్దెనెక్కిన బీజేపీకి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురారివశిష్ట, శంకర్‌నాయక్, సయ్యద్ అంజద్, అశోక్, కస్తూర్‌పల్లి అశోక్, అశోక్‌గౌడ్, చిన్నయ్య, రమేశ్, ఖుషీ, ఎస్ఎం.గౌసన్, మొగులప్ప, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.




# పెద్దేముల్ గెస్ట్ హౌజ్‌ను పట్టించుకోండి...

**● జల జల కారుతున్న భవనం**
**● పట్టించుకోని ప్రభుత్వం**



పెద్దేముల్ మండలంలో ఏర్పాటు చేసిన గెస్ట్ హౌజ్

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (ఆక్టోబర్ 08):**

పెద్దేముల్ మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన గెస్ట్ హౌజ్ (వసతి గృహం) రోజు రోజుకు శిథిలావస్థకు చేరుతుంది. అక్కడికి వెళ్లే వారులేక ... దానిని ఎవరు పట్టించుకోక, వర్షం నీరు ఆవరణలో చేరి కంపుకోడుతుంది. కనీసం నెలకు ఓ సారి కూడ దానిని సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల నాయకులు, ప్రజలు అంటున్నారు. మండల కేంద్రంలో గెస్ట్ హౌజ్ ఉన్న విషయం నాయకులకు తెలసా లేదా అని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2021 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం సుమారు రూ.20లక్షల వరకు జడ్పీ నిధులు ఖర్చు పెట్టి మండల పరిషత్ ఆవ రణలో గెస్ట్ హౌజ్ భవనంను ఏర్పాటు చేసుకుంది. కాని చాల మంది నాయకులకు అసలుకే తెలియదు. పాలకులు వచ్చిన సమయంలో కూడ మండల కేంద్రంలో గెస్ట్ హౌజ్ ఉన్న విషయం కూడ మండల నాయకులు ఎవరు గుర్తు చేయరు. దీంతో దిన దిన అధి శితిలావస్థకు చేరుతుందని పలు గ్రామాల పాలకులు అంటున్నారు. ప్రారంభోత్సవం చేసిన సమయంలో వసతి గృహంలో టీవీ, ఏసీ, ఫ్యాన్స్‌తో పాటు అన్ని వసతులు కల్పించారు. ప్రస్తుతం అవి పనిచేయడం లేదన్నట్లు తెలస్తుంది. ముఖ్యంగా మండలంలో పూర్తి స్థాయి అధికారులు లేక పోవడం, వాటిని ఎవరు పట్టించుకోవడం లేదన్న ఆరోపనలు వస్తున్నాయి. ఇప్పటికైన సంబందిత అధికారులు గెస్ట్ హౌజ్‌ను వినియోగంలోకి వచ్చేల చుడాలని పలు గ్రామాల నాయకులు, ప్రజలు అంటున్నారు.



## ఆత్మూర్‌లో తెగి పడిన33 కెవి విద్యుత్ వైరు

**● తప్పిన ప్రమాదం ● త్వరలో మరమ్మత్తులు చేయాలని గ్రామస్థుల వినతి**



పెద్దేముల్ మండల ఆత్మూర్ గేట్ వద్ద తెగి పడిన 33కెవి విద్యుత్ లైన్

**పెద్దేముల్,మేజర్ న్యూస్ ( ఆక్టోబర్ 08):**

పెద్దేముల్ మండలంలో 33కెవి విద్యుత్ వైరు తెగి పడి ప్రమాదం తప్పిన సంఘటన బుదవారం పెద్దేముల్ సబ్‌స్టేషన్ పరిదిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల అడ్కిచెర్ల నుండి ఇందూరు సబ్‌స్టేషన్‌కు వచ్చె 33కెవి విద్యుత్ వైరు బుదవారం మధ్యాహ్నం సమయంలో పెద్దేముల్ మండల ఆత్మూర్ గ్రామ శివారులో బస్టాండ్ వద్ద, ప్రధాన రహదారిపై గ్రామంలోని వచ్చె మార్గంలో చికెన్ దుకాణంపై తెలి పడింది. దీంతో ఏలాంటి ప్రమాదం జరుగలేదని గ్రామ ప్రజలు తెలియచేశారు. వెంటనే గ్రామ ప్రజలు ఆత్మూర్ లైన్ మెన్ మహేష్‌కు సమాయారం అందచేశారు. వారు వెంటనే పెద్దేముల్ మండల ఏఈ రఘువీర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలియచేశారు. త్వరల్లో మరమ్మత్తులు చేయాలని గ్రామ ప్రజలు తెలియచేశారు. రాత్రి పగలు రైతులు, గ్రామస్థులు తిరుగటం వల్ల భయందోళనకు గురవుతున్నారని వెంటనే బాగు చేయాలన్నారు.

## మద్యం షాప్‌లకు ధరఖాస్తులు ఆహ్వానం

**● ఇప్పటి వరకు జిల్లాలో 59 మద్యం షాప్‌లకు 6 ధరఖాస్తులు స్వీకరణ ● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ గౌడ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ విజయ భాస్కర్ గౌడ్

**వికారాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08):** జిల్లాలో 59 మద్యం దుకాణాలకు గాను ధరఖాస్తులు స్వీకరించండం జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో గల పారిశ్రామిక వేత్తలు, హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు, టెక్స్‌టైల్స్ వ్యాపారవేత్తలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మద్యం దుకాణాలకు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. ధరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 18 చివరి తేది అని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధన



పరిసరాలను చూపిస్తూ పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

**కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08):** ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధన అందించడం జరుగుతుందని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వరలక్ష్మి, ఉపాధ్యాయురాలు రజనీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంనగర్, గోప్య నాయక్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులను క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్లి ప్రకృతిని చూపిస్తూ పాఠ్యాంశాలను బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు వివరణాత్మక బోధనతోపాటు పరిసరాలకు తీసుకు వెళ్లడం ద్వారా విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయురాలు ఖలీదా బేగం, స్వప్న, అంగన్వాడి టీచర్లు మల్లమ్మ, మల్లమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం...

- యాచారంలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ
- పాలించమంటే శాశిస్తున్న స్థానిక ఎమ్మెల్యే
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలి
- బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి





యాచారం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8): ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీలను అమలు చేయడంలో విఫలమైందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో టిఆర్ఎస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... బిఆర్ ఎస్ పాలన లో కెసిఆర్ తెలంగాణ ప్రజలను ఎంతో అపురూపంగా చూసుకున్నారని, అది ఓర్చుకోలేని కాంగ్రెస్ పార్టీ మోస పూరితమైన హామీలతో ప్రజలకు మాయ మాటలు చెప్పి ప్రభుత్వం ఏర్పాటు చేసుకొని గ్యారంటీల ముసుగులో కాలం గడుపుతుందని ఆరోపించారు. వారు చేపట్టిన ఏ ఒక్క గ్యారంటీ పేద ప్రజలకు అందడం లేదని, ఇక రైతన్న తిప్పలు కాంగ్రెస్ ప్రభుత్వం లో వర్ణనాతీతమని, యూరియా కోసం రైతులు చేసిన యుద్ధం అందరి కళ్ల ముందు కదలాడుతుందన్నారు. ఇలా ఎన్నో కాంగ్రెస్ చేసిన మోసాల వల్ల నేడు ప్రజలకు చెందాల్సిన ఏ ఒక్క గ్యారంటీ, పథకాలు అర్హుల వద్దకు చేరడం లేదని ఆవేదన చెందారు. కాంగ్రెస్ పాలన 22 నెలలు గడుస్తున్నా వారు హామీ ఇచ్చిన మహిళలకు 2500, బతుకమ్మ చీరలు, కళ్యాణ లక్ష్మి తులం బంగారం, స్కూటీలు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, ఫీజ్ రివెంబర్స్ మెంట్, బీడీ కార్మికులకు పెన్షన్, వరి పంటకు బోనస్,ఉద్యమకారులకు 250 గజాల స్థలం వికలాంగులు వితంతువులకు పెంచడం వంటివి ఏమయ్యాయి అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి ఎన్నికల ముందు యాచారం మండల కేంద్రం లో పర్యటించినప్పుడు ఫార్మసిటీ రద్దు చేపిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. నేడు హామీ నెరవేర్చకపోవడంతో ఎందుకు మాట మారుస్తున్నారని అడిగిన రైతుల మీద అహంకార పూరిత సమాధానాలు చెబుతున్నారని ఆగ్రహించారు. ఒక్క ఫార్మ విషయంలోనే కాకుండా పాలన విషయం లో కూడా ఎమ్మెల్యే సరిగ్గా నడుచుకోవడం లేదని, ఓట్లు వేశారు, గద్దెనెక్కించారు మీ తో మాకు పనేంటి అన్న చందంగా వ్యవహారిస్తున్నారని పలువురు ప్రజలు కిషన్ రెడ్డి తో చెప్పినట్లు ఆయన వివరించారు. సమయ పాలనతో పాటు మీ పాలన ఎంతో సక్రమంగా ఉండేదాని, నేడు అది కరువైందని ప్రజలు ఆవేదన తో తనకు వివరించారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక నాయకుడు ముదిరెడ్డి కోదండ రెడ్డి విఫలమయ్యారని తెలిపారు. ఫార్మాసిటీ పట్టా రైతుల భూములకి వెంటనే పట్టాలు పంపించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సరైన అవకాశం ప్రజలకు నేడు వచ్చిందని వినియోగించు కోవాలన్నారు. నాయకుల నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరు కాంగ్రెస్ అసంపూర్తి బాకి కార్డును ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ నేతలను బాకీకార్డు చూపించి నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, మాజీ జెడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ,పిఏసిఎస్సి చైర్మన్ రాజేందర్ రెడ్డి, డైరెక్టర్ మక్కపల్లి స్వరూప,నాయకులు రాజు నాయక్, హబీబుద్దిన్, జగదీష్ నాయక్, గోపాల్, మహమ్మద్ కాజు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెండో భార్యను హతమార్చిన భర్త -చున్నీతో ఉరివేసి బండరాయితో బాది హత్య



-హత్యకు గురైన మహిళా

చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08)ః రెండో భార్యను బండరాయితో అతికిరాతకంగా బాది హతమార్చిన సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూర్ అనుబంధ గ్రామమైన వెంకన్నగూడ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ భూపాల్‌శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.... మండల పరిధిలోని ఆలూరు అనుబంధ గ్రామం వెంకన్నగూడకు చెందిన బుడగ జంగయ్య 15ఏళ్ల క్రితం మొదటి భార్య ఉండగానే రజిత(30) రెండో భార్యగా వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం భర్తను వదిలేసి సంగారెడ్డి జిల్లా పటన్‌చెరులో రజిత నివాసం ఉంటుంది. ఆర్సీపురం ఎల్ఐజీ కాలనీలో జంగయ్య నివాసం ఉంటు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం రెండో భార్య రజిత అచూకీ తెలుసుకుని ఆమెకు నచ్చజెప్పి మొదటి భార్యతో కలిసి ముగ్గురు ఒకేచోట ఉన్నారు. కొన్ని రోజులకే మళ్లీ వారితో కలిసి ఉండకుండా ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. రజిత ఆచూకీ దొరకడంతో సోమవారం ఆమెను తీసుకుని స్వగ్రామమైన వెంకన్నగూడ గ్రామానికి వచ్చాడు. తనతో కలిసి ఉండేందుకు ఒప్పించే ప్రయత్నం చేశాడు. గ్రామంలో ఓ పెద్ద మనిషి వద్ద పంచాయతీ పెట్టారు. అయిన రజిత అతనితో కలిసి ఉండేందుకు ఒప్పుకోలేదు. దీంతో ఆమెపై పగ పెంచుకుని హత్య చేసేందుకు పూనుకున్నాడు. మంగళవారం సాయంత్రం చిట్టెంపల్లి గేటు వద్దకు వెళ్లి మద్యం తీసుకుని గ్రామ శివారులో ఇద్దరు కలిసి తాగారు. రాత్రి 12గంటల సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త చున్నీతో భార్య మెడకు చుట్టి హత్య చేసి అక్కడే ఉన్న సిమెంట్ బండరాయితో బాదాడు. అనంతరం పిల్లలకు వీడియో కాల్ చేసి తల్లిని హత్య చేసినట్లు చూపించాడు. గ్రామ మాజీ సర్పంచ్‌కి ఫోన్ చేసి హత్య చేసినట్లు చెప్పి పోలీసులకు లొంగిపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



హంతకుడు బుడగ జంగయ్య

## జిల్లేడు-చౌదరి గూడెంలో బిఆర్ఎస్ గ్రూపు రాజకీయాలు

జిల్లేడు- చౌదరి గూడెం: మేజర్ న్యూస్:( ఆక్టో బర్:8): జిల్లేడు- చౌదరి గూడెం మండల ములో బి ఆర్ ఎస్ పార్టీ లో అంతర్గత కలహాలు మొదలైనట్టు బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తెలిపారు. అసలే ప్రస్తుతం రాష్ట్ర ములో స్థానిక సంస్థల ఎన్నికలు ఆసన్నమైందని, వర్గ పోరు జరగుతుంది అని ఆయన అన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు చేస్తున్నాయని ఆయన అన్నారు. నా వర్గం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అని మరో వైపు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి వర్గమని మరికొంత మంది నాయకులు అంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ములో స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఈ గ్రూపు రాజకీయాలు చేస్తున్నాయని ఆయన అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు చర్చిస్తున్నారు అని ఆయన అన్నారు. ఈ ప్పటి కైన రాష్ట్ర అధినాయకత్వం కల్పించుకొని వెంటనే గ్రూపు రాజకీయాలు లేకుండా చేయాలని ఆయన కోరారు. ఏదిఏమైనా సంబంధిత పార్టీ పెద్దలు కల్పించుకొని గ్రూపు రాజకీయాలు లేకుండా చేయాలని ఆయన కోరారు.

## పిడుగు పడి బాలుడు మృతి



యాచారం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8): పిడుగు పాటుకు బాలుడు మృతి చెందిన ఘటన యాచారం మండల కేంద్రంలోని నల్లవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జోగు మనిష్ (12) అనే బాలుడు మృతి చెందాడు. పాఠశాల అయిపోయాక ఇంటికి వచ్చిన మనీష్,సాయంత్రం కురిసిన వర్షానికి తన ఇంటి ముందున్న వేప చెట్టు కింద ఆడుకుంటుండడం తో అదే వేప చెట్టుపై పిడుగు పడడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు.

## బైరాగి గూడా రోడ్డు సమస్య పరిష్కారానికి రక్షణ శాఖ అధికారులను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08)బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగి గూడా నుండి నార్సింగి కి వెళ్లే రోడ్డు కు మరమ్మత్తుల చేయడానికి రక్షణ శాఖ అధికారుల అనుమతి కొరకు బుధవారం కార్పొరేషన్ డి ఇ యాదయ్య తో కలిసి బి జె ఎం సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్మీ అధికారులను సంప్రదించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రక్షణశాఖ క్యూ బ్రాంచ్ లోని ఆర్మీ అధికారులకు రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న. బైరాగి గూడా నుండి నార్సింగి వెళ్లే రహదారి మరమ్మతులు చేయడానికి అనుమతి ఇవ్వాలని వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. త్వరలో రక్షణ శాఖ అధికారులు సమక్షంలో రోడ్డుకి మరమత్తులు చేయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్,ఏ బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్, మాజీ ఎంపీటీసీ భోగాల శ్రీనివాస్ బీసీ సెల్ అధ్యక్షులు అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ రిటర్నింగ్ అధికారిగా మహమ్మద్ రియాజ్



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08)ః చేవెళ్ల జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ రియాజ్ బుదవారం నియమితులయ్యారు. ఈ మేరకు చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం ఎన్నికల అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ, ఎంపీటీసీల నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు సహకరించాలని సూచించారు.

## జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు మాదిగ వర్గానికి కేటాయించాలి

**-ఆలూర్ మాజీ ఉపసర్పంచ్ నర్సింలు**



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08)ః చేవెళ్ల జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు మాదిగ సామాజిక వర్గానికి టికెట్లు కేటాయించాలని ఆలూర్ మాజీ ఉపసర్పంచ్ మొకురం నర్సింలు అన్నారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ....ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు అన్ని రాజకీయ పార్టీలు మాదిగ సామాజిక వర్గానికి టికెట్లు కేటాయించాలని, ఇప్పటివరకు మాదిక సామాజిక వర్గానికి టికెట్లు ఇవ్వాలేదని, ఇప్పుడు అవకాశం ఉన్నందున తమ వర్గానికి కేటాయించాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి చేవెళ్ల జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు తాను బరిలో ఉన్నట్లు చెప్పారు. ఎంపీపీ, జడ్పీటీసీ టికెట్ల విషయంలో స్థానికులకే కేటాయించాలని సూచించారు.

## ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08)ః స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. శంకర్‌పల్లి చౌరస్తాలో ఎస్సై శిరీష ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, రూ.50వేల కంటే ఎక్కువ ఉంటే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులను తరలిస్తే కూడా సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు వాహనాల తనిఖీ చేపడుతామని తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్సై బుగ్గయ్య, కానిస్టేబుల్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

# సామాజిక అసమానతల అంతమే కేవీపీఎస్ అంతిమ లక్ష్యం...

● ఘట్ కేసర్‌లో ఘనంగా కేవీపీఎస్ 28వ ఆవిర్భావ వేడుకలు



**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(అక్టోబర్, 08):** వేళ ఏళ్లుగా కొనసాగుతున్న కుల ఆర్థిక సమానతలను అంతం చేయడమే కేవీపీఎస్ లక్ష్యంగా కృషి చేయాలని కెవిపిఎస్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎన్. సబిత, జిల్లా మాజీ నాయకులు చింతల యాదయ్య అన్నారు.బుధవారం ఘట్ కేసర్ సీఐటీయూ కార్యాలయం వద్ద కేవీపీఎస్ 28వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆత్మగౌరవం సమానత్వం కుల నిర్మూలన లక్ష్యాలు కలిగిన కెవిపిఎస్ పతాకాన్ని కేవీపీఎస్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎన్ సబిత ఎగురవేశారు. అనంతరం కేవీపీఎస్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎన్. సబిత, కేవీపీఎస్ మాజీ జిల్లా నాయకులు చింతల యాదయ్య లు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని ప్రత్యేక అసమానతలు కులం రూపంలో ఈ దేశంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని వీటివల్ల దేశం పూర్తిస్థాయిలో వెనుకబడిపోయిందన్నారు. సాటి మనిషిని మనిషిగా చూడని నీచత్వం ఉందన్నారు. 78 ఏళ్ల స్వాతంత్రం తర్వాత కూడా నేటికీ గుడి బడిలో నేటికీ వివక్ష కొనసాగడం దేశ ప్రజల ఐక్యతకు దేశ అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందన్నారు. కుల వ్యవస్థను అసమానతలు సమర్థించే పాలకులు అధికారంలో ఉండటం వల్ల రాజ్యమే ఈ అసమానతలకు అండగా నిలబడటం వల్ల వాటిని రూపుమాపడానికి తరతరాలు పడుతుందన్నారు. యువతరం విద్యావంతులు కుల నిర్మూలన లక్ష్యం కోసం కృషి చేయాలన్నారు. కుల వ్యవస్థ మూలాలు భూస్వామ్య మనువాద వ్యవస్థలలో ముడిపడి ఉన్నాయని చెప్పారు. మనువాదమే మన దేశాన్ని శాసిస్తుందని దానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం లో అందరూ ఐక్యంగా ముందుకు సాగితేనే దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందన్నారు.శాస్త్ర సాంకేతిక రంగం ఆకాశం ఎత్తుకు ఎదుగుతుంటే మరోవైపున సాటి మనిషిని నీచంగా చూడటం అంటే మనువాద ప్రభావం ఏమిటో విధితమవుతుందన్నారు. చట్టం ముందు అందరూ సమానులే అని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మనువాదం సృష్టించిన అసమానతల్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు .బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులపై 300 రెట్లు దాడులు పెరిగాయన్నారు గత ఐదేళ్ల కాలంలో 6.34.486 దౌర్జన్యాలు జరిగినట్లు ఎన్సీర్బీ నివేదిక పేర్కొంటుందన్నారు. అందులో సగానికంటే ఎక్కువ బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్ లో 3లక్షల దౌర్జన్యాలు జరిగాయన్నారు వీటిని అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. దళితులకు దేశ ప్రజలందరికీ గుండెకాయ లాగా నిలుస్తున్న భారత రాజ్యాంగంరద్దు కు కుట్ర జరుగుతోందని చెప్పారు. స్వాతంత్ర ఉద్యమ వెల్లువలో ఏర్పడిన ఈ రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. మన రాజ్యాంగం స్థానంలో తిరిగి మనుస్మృతిని ప్రవేశపెట్టడానికి ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బిజెపి కృషి చేస్తుందన్నారు దీనివల్ల దేశం మళ్లీ మధ్యయుగాల కాలంలోకి ప్రయాణిస్తుందన్నారు తిరిగి చాతుర్వర్ణ వ్యవస్థ రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ దేశంలో కష్టజీవులు ఐక్యత కోసం కులం మత అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు మరింత విస్తృతంగా జరగాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్. భవాని, రజిత, అనూష, మాలిని, కవిత, సత్తమ్మ, సరిత, మాధవి, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహనా కలిగి ఉండాలి

## జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్




వికారాబాద్‌జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): జిల్లాలో సమాచార హక్కు చట్టం–2005 పై ప్రతి ఒక్కరు పూర్తి అవగాహనా కలిగి ఉండాలని, సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి అధికారులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ . అక్టోబర్ 5 నుండి 12 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి లో నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా బుధవారం కలెక్టరేట్లోని సమావేశము హాలు నందు జిల్లా స్థాయి లో అన్ని శాఖల అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకతను తీసుకురావడం, ప్రభుత్వ అధికారులు తమ చర్యలకు జవాబుదారీగా ఉండేలా చేసిన ఈ చట్టం పట్ల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే దరఖాస్తు దారుడు కోరిన సమాచారాన్ని సరైన విధంగా, నిర్ణీత గడువులో ఇవ్వగలుగుతారన్నారు .ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారులు ఈ చట్టంలో పొందుపరిచిన ప్రతి అంశం పైన అవగాహన ఉండాలని, ప్రతీ దరఖాస్తుకి సమాధానాన్ని ఇవ్వడం సులబమవుతున్దన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు వారి క్రింది స్థాయి సిబ్బందికి చట్టం మీద అవగాహన కలిగించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు.డి ఆర్ ఓ మంగీ లాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వార సమాచార హక్కు చట్టంపై అవగాహనా కలిపించారు. ఈ సమావేశం లోఆర్ డి ఓ వాసు చంద్ర,డిప్యుటీ కలెక్టర్ లు (ట్రైనీ ) చంద్ర కిరణ్, పూజ, వివిధ జిల్లా స్థాయి అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# పీర్జాదిగూడ సమీకృత వ్యర్థ పదార్థాల శుద్ధికరణ పార్క్ సందర్శన...





**మేడిపల్లి ,మేజర్ న్యూస్ (అక్టోబర్ 08):**
పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని సమీకృత వ్యర్థపదార్థాల శుద్ధికరణ పార్కును బుధవారం నాడు ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఐ ఏ ఎస్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఐఏఎస్‌తో కలిసి సందర్శించా రు. అక్కడ జరుగుతున్న ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ లో యంత్రాల పనితీరు, వాటి సామర్థ్యం, ఘన వ్యర్థాలను వేరు చేయు విధానం మరియు పునఃచక్రియ0 జరుగు విధానము, కంపోస్ట్ యూనిట్, తడి వ్యర్థాలతో బ్రికెట్స్ తయారీ విధానాన్ని పరిశీలించారు. జరుగుతున్న ప్రాసెసింగ్ విధానంపై పలువురు అధికారులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కమిషనర్ టి ఎస్ వి ఎన్ త్రిలేశ్వర్ రావు తెలిపారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయినాథ్ గౌడ్, ఏఈ వినీల్, ఐటీసీ ప్రతినిధులు ఉమాకాంత్, సుధ, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

# కట్ట లక్ష్మి అంత్యక్రియలకు ఆర్థిక సాయం...



**కీసర, మేజర్ న్యూస్(అక్టోబర్ 08):**
అనారోగ్యంతో మృతి చెందిన గోధుమకుంట గ్రామస్తులు కట్ట లక్ష్మి అంత్యక్రియలకు మాజీ సర్పంచ్ మంచాల అనిత శ్రీనివాస్ ఆర్థిక సాయం చేశారు. బుధవారం కట్ట లక్ష్మి నివాసానికి వెళ్లిన మంచాల అనిత శ్రీనివాస్ వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మానవత్వంతో సహాయం చేసిన ముందుకు వచ్చారు. అంత్యక్రియలకు అవసరమైన ఖర్చుల నిమిత్తం స్వచ్ఛందంగా 3000 రూపాయలు అందించి ధైర్యాన్ని కోల్పోవద్దని ఎప్పుడు అందుబాటులో ఉంటారని మాటిచ్చారు. కార్యక్రమంలో బంటు శ్రీనివాస్, కట్ట శంకరయ్య పలువురు పాల్గొన్నారు.

# మీకు నేనున్నా.... అధైర్యం వద్దు

## అంత్యక్రియలకు వంగేటి పర్వత్ రెడ్డి ఆర్థిక సహాయం



**కీసర,మేజర్ న్యూస్(అక్టోబర్ 08):**
అనారోగ్యంతో మృతి చెందిన గోధుమకుంట గ్రామస్తులు కట్ట లక్ష్మి అంత్యక్రియలకు వంగేటి పర్వత్ రెడ్డి ఆర్థిక సాయం చేశారు. బుధవారం కట్ట లక్ష్మి నివాసానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి పర్వత్ రెడ్డు వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మానవత్వంతో సహాయం చేసిన ముందుకు వచ్చారు. అంత్యక్రియలకు అవసరమైన ఖర్చుల నిమిత్తం స్వచ్ఛందంగా ఐదు వేల రూపాయలు అందించి ధైర్యాన్ని కోల్పోవద్దని ఎప్పుడు అందుబాటులో ఉంటారని మాటిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంచాల అనిత శ్రీనివాస్, బంటు శ్రీనివాస్, కట్ట శంకరయ్య పలువురు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి

● మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్



**చౌడాపూర్,మేజర్ న్యూస్ ( అక్టోబర్ 08 ):**
పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ గ్రామపంచాయతీలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో రానున్న స్థానిక సంస్థల,సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థులను కార్యకర్తలు సమన్వయంతో ప్రతి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకో వాలని చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నరసింహ నాయక్,మండల సీనియర్ నాయకులు నర్సింహా ండ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం,వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ శేఖర్,గ్రామ కమిటీ అధ్యక్షులు శివకుమార్, నర్సింలు,వెంకటయ్య,సత్య కుమార్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధునాతనమైన టెక్నాలజీని పెంపొందించుకోవాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్ • మంచి ఉద్యోగాలు పొందవచ్చు • టెక్నాలజీ విద్య పై మక్కువ పెంచండి



**మర్పల్లి మేజర్‌న్యూస్ (అక్టోబర్08)** నేటి సాంకేతిక రంగంలో నిలవడాలంటే అధునాతనమైనా టెక్నాలజీని పెంపొందించుకోవాలనీ ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చుననీ జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు.బుధవారము మర్పల్లి మండలంలోని ఏటిసి సెంటర్‌ను కలెక్టర్ సంద ర్శించారు ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూఏటిసిలో శిక్షణ పొందిన వారికి మంచి ఉపాధి అవకాశాలు వస్తాయనీ ఆయన అన్నాపరు.శిక్షణలో చేరిన వారికిఅసక్తీ ఉన్న సబ్జెక్టులలో మంచి నాణ్యమైనా శిక్షణను అందివ్వాలనీశిక్షకులకు ఆదేశించారు ఏటీసిలో గల సౌకర్యాలకు కలెక్టర్ ఆరా తీశారు.వివిధ విషయాల పై కలెక్టర్ విద్యార్థులతలో అడిగి తెలుసుకున్నారు.శిక్షణకు వచ్చే విద్యార్థులకు అధునాతనమైనా శిక్షణను అందివ్వాలనీ అధికారులకు సూచించారు.ఏటీసిలో ఫర్నీచర్ లేక పోవడంపై విద్యార్థులకు ఫర్నీచర్ సమకూరుస్తానని ఆయన హీమి ఇచ్చారు.



ఏటీసిలో ఏవైనా సమస్య లుంటే తమ దృష్టికి తీసుకురావాలనీ ఆయన తెలిపారు కలెక్టర్ సందర్శనలో భాగంగాతహాశిల్దార్ పురుశొత్తం, ఎంపిడీఓజయరాం, ప్రిన్సిపాల్, సుధీర్,ఏటీసి ఇన్‌చార్జీ ప్రకాశ్,ఏటీసి సిబ్బంది పాల్గోన్నారు.

# విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యతతో కూడిన శిక్షణను అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



ఏటీసీ ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్(అక్టోబర్ 08):** ఏటీసీలలో సాంకేతిక నైపుణ్యతతో కూడిన శిక్షణను అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీసీలో గల సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏటీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులతో కావలసిన మౌలిక సదుపాయాలు, వివిధ సౌకర్యాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులకు ఆధునాతన సాంకేతికలో పట్టు సాధించే విధంగా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏటీసీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. ఏటీసీలో ఫర్నిచర్ లేని పరిస్థితిని గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు సరిపోను కుర్చీలను సమకూరుస్తానని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ సందర్శనలో భాగంగా ఏటిసి ఇంచార్జ్ ఎస్.ఎం. సరూష్, ఏటి సిబ్బంది ఉన్నారు.

# గిర్మాపూర్ గ్రామస్తుల ధర్నా

- రోడ్డు పూర్తి చేసి బస్సు సౌకర్యం పునరుద్ధరించండి!
- మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన
- హౌసింగ్ బోర్డ్ రోడ్డు ఆలస్యంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):**

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్, రాయిలాపూర్ గ్రామాలకు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం సుదీర్ఘ కాలంగా కొనసాగుతుండడంతో రహదారి మూసుకుపోయి, ప్రజల రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. ఈ సమస్య పరిష్కారం కోసం బుధవారం గ్రామ ప్రజలు మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ,...రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఆర్టీసీ బస్సులు గ్రామానికి రాకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. మేడ్చల్ పట్టణానికి చేరుకోవడానికి నాలుగు%–%ఐదు గ్రామాల మీదుగా తిరుగాల్సి వస్తోందని, ఇది సమయం, ఖర్చు రెండింటినీ పెంచుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారు పేర్కొన్న దాని ప్రకారం, రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి అయినప్పటికీ, మేడ్చల్ హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు రహదారి పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ రహదారి పనులు ఆగిపోవడంతో ఆర్టీసీ బస్సులు గిర్మాపూర్ గ్రామానికి తిరిగి రాకపోవడం, ప్రజలు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడటానికి కారణమవుతోంది. ముఖ్యంగా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతి రోజూ



దీర్ఘదూరం ప్రయాణించి కళాశాలకు చేరుకోవాల్సి వస్తోందని చెప్పారు.

ఈ నేపథ్యంలో హౌసింగ్ బోర్డ్ రోడ్డు వెంటనే పూర్తి చేసి, గ్రామానికి బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ధర్నాలో వంగేటి హనుమంత్ రెడ్డి, వంగేటి రాజి రెడ్డి, కొండం ఆంజనేయులు, రాఘవ రెడ్డి, చీర్ల చంద్రశేఖర్, బండి విష్ణు గౌడ్, చీర్ల సత్యనారాయణ, అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, బండి బాబు గౌడ్, మల్లారెడ్డి, శ్రీపాల్ రెడ్డి, వంశీ రెడ్డి, జావీద్, వివేక్, ఆనంద్, అర్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ యాప్ వినియోగంపై ఏవో, ఏఈవోలు అవగాహన కలిగి ఉండాలి: జిల్లా వ్యవసాయాధికారి ఉష




**రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08) :** వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు డిజిటల్ యాప్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. బుధవారం హయత్‌నగర్ లోని కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయశాఖ అధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయో సైన్స్ ఇంటర్నేషనల్ (సిఏబీఐ) సహకారంతో ఆధునిక డిజిటల్ వ్యవసాయ విధానం, చీడపీడల యాజమాన్యంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. సమయానుకూలంగా సాంకేతిక సమాచారాన్ని రైతులకు చేరవేయడం అత్యంత కీలకమని తెలిపారు. డిజిటల్ యాప్ వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని రైతులకు పురుగుల మందుల వినియోగంపై మార్గనిర్దేశం చేయాలని సూచించారు. పంటలకు వచ్చే ప్రమాదాలను సకాలంలో పసిగట్టి అంచనావేసి వాటి నివారణకోసం చర్యలు చేపట్టేందుకు, నష్టాలను నివారించేందుకు డిజిటల్ వ్యవసాయ విధానం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయడంలో, నాణ్యతను మెరుగుపర్చడంలో తోడ్పడుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధు మంజరి, సిఏబీఐ కోఆర్డినేటర్ డాక్టర్ అనిఫా, డిడిఏ చంద్రశేఖర్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## దేవరయంజాల్‌లో నీటి ముంపు సమస్యలపై

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయి పర్యటన

- చెరువుల నాళాల పునరుద్ధరణకు ఆదేశాలు
- ఆక్రమణలపై కఠిన హెచ్చరిక



**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):** తూంకుంట పురపాలక పరిధిలోని దేవరయంజాల్ మరియు కండ్లకోయ గ్రామాల సరిహద్దు వద్ద రహదారి పరిస్థితులు, చెరువుల నాళాల స్థితిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐపీఎస్ బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దేవరయంజాల్‌లోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన పరిస్థితిని కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,.. "ఆక్రమణకు గురైన నాళాలను తక్షణం గుర్తించి పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలి. ఇరిగేషన్ విభాగం సర్వే రిపోర్ట్ అందిన తర్వాత గొలుసుకట్టు చెరువుల నాళాలు మరియు వాటి విస్తీర్ణంపై పూర్తి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటాం," అని తెలిపారు. తదనంతరం కమిషనర్ రంగనాథ్ దేవరయంజాల్, మందాయిపల్లి, తూంకుంట ప్రాంతాల్లోని చెరువులను కూడా పరిశీలించారు. చెరువుల నాళాలను శుభ్రపరచి నీటి ప్రవాహం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. ఆక్రమణలు కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, శామీర్‌పేట తహసిల్దార్ యాదగిరి రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్, అలాగే మున్సిపల్ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలలను పకడ్బందీగా నిర్వహించాలి




**శంకర్పల్లి,మేజర్‌న్యూస్(అక్టోబర్9)** రాబోయే స్థానిక ఎన్నికలలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని శంకర్పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ అన్నారు. బుధవారం రోజున శంకర్పల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఎలక్షన్లు జరిగే గ్రామాలలో అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. అధికారులు వారి వారి బాధ్యతలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగ్ ఏసిపి రమణ గౌడ్, శంకర్పల్లి మరియు మోకిలా సిఐలు శ్రీనివాస్ గౌడ్, వీరబాబు, స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు, ఎంపీ ఓ గిరిరాజ్ మరియు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం

- జిల్లాలో 5.24 లక్షల పిల్లలకు పోలియో మోతాదులు
- అక్టోబర్ 12న బూత్‌ల వద్ద ప్రారంభం
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.ఉమా గౌరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్, 08):** జిల్లాలో రాబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈ దిశగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీ.సీ హాల్‌లో నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సమావేశానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సీ. ఉమా గౌరి అధ్యక్షత వహించారు. కార్యక్రమం విజయవంతం కోసం అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది సమన్వయం, వైద్య బృందాల కేటాయింపు, మరియు ప్రజా అవగాహన చర్యలపై ఆమె సంబంధిత శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల 5,24,973 మంది పిల్లలకు పోలియో మోతాదులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం మొత్తం 1,125 పోలియో బూత్‌లు, 31 మొబైల్ టీములు, అలాగే 31 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రతి బూత్ వద్ద వైద్య సిబ్బంది, వాలంటీర్లు మరియు సహాయక సిబ్బందిని నియమించి, పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సబ్ నేషనల్ డేలో భాగంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం అక్టోబర్ 12, 2025న అన్ని బూత్‌లలో ప్రారంభమవుతుంది. అనంతరం అక్టోబర్ 13 నుండి 15 వరకు గృహ సందర్శనల ద్వారా పోలియో చుక్కలు వేయడం కొనసాగుతుంది. అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, ఇంకా పోలియో మోతాదు పొందని పిల్లలకు చుక్కలు వేయనున్నారు. జిల్లాలోని ప్రతి పిల్లవాడు పోలియో మోతాదు తప్పనిసరిగా తీసుకునేలా తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు చురుకుగా సహకరించాలని డాక్టర్ ఉమా గౌరి పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కౌశిక్, ప్రోగ్రాం అధికారులు డా. మహేశ్వరి, డా. చంద్రకళ, డా. శ్రీదేవి, డా. సత్యవతి, అలాగే జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి, శిశు సంక్షేమ శాఖ అధికారి, జిల్లా విద్యాధికారి, పబ్లిక్ రిలేషన్ అధికారి, సంక్షేమ శాఖ అధికారి, మెప్మా అధికారి మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెడిసిటీలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ అవగాహన కార్యక్రమం

- ఆపదల సమయంలో మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక కార్యశాల



**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఘన్‌పూర్, మేడ్చల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న జరుపుకునే ఈ దినోత్సవం సందర్భంగా, మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించడం లక్ష్యంగా అక్టోబర్ 4 నుండి 10 వరకు మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది కార్యక్రమం "ఆపదలు, ప్రమాదాలు, విపత్తుల సమయంలో మానసిక ఆరోగ్య సంరక్షణ" అనే థీమ్తో కొనసాగుతోంది. అక్టోబర్ 4న కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు కళాశాలలో స్కిట్‌ల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య అవగాహన కల్పించారు.

నేడు కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యశాలలో, ఆపదలు లేదా విపత్తులు సంభవించిన సందర్భాల్లో మానసిక ఆందోళనకు లోనైన వారికి తక్షణ సహాయం ఎలా అందించాలో నిపుణులు సూచనలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ (ప్రెసిడెంట్, యంఐయంయస్), డా. మహేంద్ర సింగ్ నేగి (ప్రిన్సిపాల్), డా. డి. శైలేంద్ర (వైస్ ప్రిన్సిపాల్), డా. అనురాగ్ శ్రీవాత్సవ (హెచ్‌ఓడీ, సైకియాట్రీ), డా. సూర్య ప్రభ, డా. ఈనాక్షి, డా. మృదుల తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ మెడిసిన్ మరియు సైకియాట్రీ విభాగాల వైద్యులు, పీజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఇంటర్న్‌లు, పారా మెడికల్ విద్యార్థులు, రోగులు మరియు వారి బంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డా. బయ్యారపు సురేందర్ వర్మకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు - 2025

## విద్యా రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఏఐసీఎఫ్ నుంచి గౌరవం

**కీసర, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వారు అందించే ప్రతిష్టాత్మక నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు-2025ను గోధుమకుంట గ్రామం, కీసర మండలంలోని యూకే బి.ఎడ్. కళాశాల ప్రిన్సిపల్ డా. బయ్యారపు సురేందర్ వర్మ అందుకున్నారు. ఈ అవార్డు సాధించిన సందర్భంగా కళాశాల యాజమాన్యం డైరెక్టర్ ఉదయ్ కుమార్, కరస్పాండెంట్ డా. విద్యా స్రవంతి, అలాగే కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను హృదయపూర్వకంగా అభినందించారు. డా. బయ్యారపు సురేందర్ వర్మ 2007లో లెక్చరర్‌గా బోధనా రంగంలో అడుగుపెట్టి, తన ప్రతిభతో 2015లో ప్రిన్సిపల్‌గా పదోన్నతి పొందారు. ఆయన నాయకత్వంలో కళాశాల విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఇప్పటివరకు వందలాది మంది విద్యార్థులు ఆయన మార్గదర్శకత్వంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సమాజానికి సేవలందిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ పట్టా పొందిన ఆయన, అనేక జాతీయ మరియు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని, గణిత బోధన పద్ధతులపై పుస్తకాలు రచించారు. బోధన వృత్తి ద్వారా విద్యార్థుల మానసిక అభివృద్ధి, సామాజిక బాధ్యతల పెంపు కోసం ఆయన చేసిన కృషిని గుర్తించి ఏఐసీఎఫ్ సంస్థ ఈ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా విద్యావేత్తలు, రీసెర్చ్ స్కాలర్స్ మరియు విద్యా వర్గాలు ఏఐసీఎఫ్ ఫౌండర్ విజయ రాజు గద్దపాటి ని అభినందించాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డా. పిడమర్తి రవి, గదరాజు చందు, డా. వీరస్వామి, శనిగరపు బాలకృష్ణ, అభిజిత్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లాలూ ప్రసాద్, బోరెల్లి సురేష్, కూరెళ్ళ మహేష్ బాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.







# రైతుల సంక్షేమమే మా ధ్యేయం

- సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి
- పూడూరు రైతు సహకార సంఘాన్ని సందర్శించిన వ్యవసాయ అధికారి సోమ మాధవరెడ్డి



**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 8):** మేడ్చల్ మండలానికి కొత్తగా నియమితులైన వ్యవసాయ అధికారి సోమ మాధవరెడ్డి బుధవారం పూడూరు రైతు సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ నాలబాపని సుధాకర్ రెడ్డి మరియు డైరెక్టర్లు ఆయనకు శాలువా కప్పి సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ,.. "రైతుల సంక్షేమమే మా సొసైటీ యొక్క ప్రధాన లక్ష్యం. ప్రతి రైతుకు సమయానికి ఎరువులు, విత్తనాలు అందేలా కృషి చేస్తున్నాం. ఈ సీజన్‌లో యూరియా ఎరువును రైతులందరికీ సకాలంలో పంపిణీ చేశాం," అని తెలిపారు. అలాగే వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ, రైతుల అవసరాలను గుర్తించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, ఏఈవో తేజస్విని మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన అర్ధ సుధాకర్ రెడ్డి



**వికారాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08):** తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపల్‌లోని వార్డు నెంబర్ 10 అనంతగిరిపల్లి కి సంబంధించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ మంజూరు పత్రాలను వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్ధ. సుధాకర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. సుధాకర్ రెడ్డి మాట్లాడు తూ..... వికారాబాద్ మున్సిపల్‌లో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని మొదటి దశలో ఇండ్ల నిర్మాణలు దాదాపు పూర్తయ్యాయని ఇప్పుడు రెండవ దశకు సంబంధించిన మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ రెడ్యానాయక్, మాజీ కౌన్సిలర్ అంగోత్ దేవిరెడ్యానాయక్, నాయకులు చపల శ్రీనివాస్ ముదిరాజ్, మల్లికార్జున్ గౌడ్, అనంతయ్య, రాజు నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ప్రజా సంఘాల నాయకులు



**కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 8):**
కొడంగల్ పట్టణంలోని శివాలయంలో బుధవారం కులాంతర వివాహం చేసుకున్న నూతన వధూవరులను ప్రజా సంఘాల నాయకులు ఆశీర్వదించారు. తల్లిదండ్రులు జోగులక్ష్మి, జోగు అనంతయ్య, యాదమ్మ, నర్సిములు, కుల పెద్దల సమక్షంలో వధూవరుల వివాహం జరిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేవ్‌బాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంబేద్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు, న్యాయవాది రాములు, డీవీఎంసీ సభ్యుడు దస్తప్ప, మరాఠి శ్రీనివాస్, వెంకటయ్య, కుశలప్ప, సాయిలు, మోహన్, ఓం ప్రకాశ్, బత్తుల నరసింహ, మల్లేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించిన వామపక్షాలు

**- బాలాపూర్ చౌరస్తాలో సిపిఐ, సిపిఎం, మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన రాస్తారోకో.. - "దాడి చేసిన వ్యక్తికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్"**





బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): బాలాపూర్ చౌరస్తాలో వామపక్ష పార్టీలు సంయుక్తంగా నిర్వహించిన రాస్తారోకోలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్పై దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీలు సంయుక్తంగా నిర్వహించాయి.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ముకుందం చంద్రశేఖర్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి ఎం. యాదయ్య, సిపిఐ మాస్ లైన్ మండల కార్యదర్శి కొల్లూరు భీమేష్, సిఐటియు నాయకుడు బాబు తదితరులు మాట్లాడుతూ... ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడితో సమానమని అన్నారు. రాకేష్ కిషోర్ అనే వ్యక్తి చేసిన ఈ దాడిని కేవలం వ్యక్తిగత దాడిగా కాకుండా, దేశ న్యాయవ్యవస్థపై, రాజ్యాంగ పరిరక్షణపై, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా చూడాలని పేర్కొన్నారు.దేశంలో పెరుగుతున్న హింసాత్మక దాడులను అరికట్టడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని, ప్రజలకు రక్షణ లేకుండా పోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహ కార్యదర్శి జాటోత్ రెడ్యానాయక్, సిఐటియు మండల కన్వీనర్ శేఖర్ యాదవ్, మహిళా సమైక్య బాలాపూర్ మండల కార్యదర్శి పి. యాదమ్మ యాదవ్, రమావత్ శత్రునాయక్, మోహన్, మల్లికార్జున్, కంతుపల్లి నరేందర్, కొల్లూరు శంకర్, సురేష్, విజయ్, వెంకయ్య, జగన్, స్వామి, నిరంజన్, జాటోత్ శ్రీను నాయక్, జర్పుల శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలను రెచ్చగొట్టి రాజకీయాలు చేయడం బీజేపీకి అలవాటే రామిడి రామిరెడ్డి

బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): కులమత వర్గాలను రెచ్చగొట్టి రాజకీయాలు చేయడం భారతీయ జనతా పార్టీకి అలవాటే అని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రామిడి రామిరెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రామిడి రామిరెడ్డి పలువురు నేతల ఆధ్వర్యంలో అందెల శ్రీరాములకు ఘాటైన కౌంటర్ పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్లో బుధవారం విలేకరుల సమావేశంలో బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా రామిడి రామిరెడ్డి మాట్లాడుతూ.. కులమత వర్గాలను రెచ్చగొట్టి రాజకీయ లాభం పొందడం భారతీయ జనతా పార్టీకి అలవాటైపోయిందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలని పగటి కలలు కంటున్న బీజేపీ, ప్రజల మధ్య మత విద్వేషాలు రేపే ప్రయత్నాలు చేస్తోందని ఎద్దేవా చేశారు.బాలాపూర్‌లోని వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న కబ్జా సమస్యపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటుంటే, దానిని కూడా మతరంగంలోకి తిప్పడం బీజేపీ స్వభావమని ఆయన అన్నారు. గతంలో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీ చేసిన అందెల శ్రీరాములు యాదవ్ సాధించిన ఓట్లలో ముస్లిం ఓట్లు లేవా అని ప్రశ్నించారు...? ముస్లింల సహకారంతోనే మెజార్టీ సాధించిన వారు ఇప్పుడు మత ద్వేషం రేపడం విచారకరమని విమర్శించారు.సుల్తానాపూర్ ఘటనలో తమ పార్టీకి సంబంధం



లేని విషయాన్ని బీఆర్‌ఎస్‌పై మోపడం దురుద్దేశపూరితమని రామిడి రామిరెడ్డి స్పష్టం చేశారు. సబితా ఇంద్రారెడ్డి హిందూ%-%ముస్లిం పెద్దలను కలిపి, సుల్తానాపూర్ మదర్స్ పై సమస్యకు పరిష్కారం చూపడం ఆమె లౌకికతకు నిదర్శనమని చెప్పారు.మాజీ సర్పంచ్, బి ఆర్ ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ల గంటి అర్జున్ మాట్లాడుతూ.. హిందూ%-%ముస్లింల మధ్య చిచ్చు పెట్టే బీజేపీ రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాల విమర్శలు ప్రజలు గ్రహించి నిజా నిజాలతో ప్రజల అభిమానం సబితమ్మకు ఇమేజ్ పెరుగుతుందని అన్నారు. లౌకిక రాజ్యాన్ని దెబ్బతీసే బీజేపీ కుట్రలను భవిష్యత్తులో బీఆర్ఎస్ తీవ్రంగా ఎదుర్కొంటుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏనుగు రామిరెడ్డి, పెద్ద బావి ఆనంద్ రెడ్డి, పెద్ద బావి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావంలో డ్రైనేజీ సమస్యలు తీవ్రం



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): 1వ డివిజన్‌లో నవయుగ, సాయికృష్ణ ఎంక్లేవ్ కాలనీల్లో ప్రజల ఆవేదనసమస్యలను పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి.మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లో వర్షాభావం కారణంగా డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నవయుగ కాలనీ, సాయికృష్ణ ఎంక్లేవ్ కాలనీల్లో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ నీరు చేరడంతో మురుగు వాసన, దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు వివరించారు. ప్రజల ఆవేదన విని పారిజాత నర్సింహారెడ్డి వెంటనే ఏఈఈ హరీష్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరిలకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, పెద్దబావి బాబు దర్శన్ రెడ్డి, నయన చారి, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కాలనీలలో శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపడతామని పారిజాత నర్సింహారెడ్డి హామీ ఇచ్చారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను

**"బీఆర్ఎస్ బడంగ్‌పేట్ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి"**



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08): బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడకు చెందిన న్యూ మధురాపురి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని భారత రాష్ట్ర సమితి బడంగ్‌పేట్ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల న్యూ మధురాపురి కాలనీలో ఎన్నికైన కొత్త కార్యవర్గ సభ్యులు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రామిడి రామిరెడ్డి మాట్లాడుతూ...కాలనీలో ఉన్న ఏ సమస్యైనా నా దృష్టికి తెస్తే, దాని పరిష్కారానికి తప్పక కృషి చేస్తానన్నారు. యువతతో కూడిన ఈ కొత్త టీమ్ ఐకమత్యంగా పని చేస్తే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుంది" అని ఆయన పేర్కొన్నారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఆయన అభినందనలు తెలియజేస్తూ, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యూ మధురాపురి కాలనీ అధ్యక్షుడు పెరుమాళ్ళ నవీన్ రెడ్డి, ఎమిరెడ్డి మహేందర్ రెడ్డి, ముక్తా రేవంత్ కుమార్, ఉపాధ్యక్షులు కోట్ల అశోక్ కుమార్, కోశాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శి ఆకుల బలవంత్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుకకు అడ్డుకట్టేది....?

- పోలీసుల కనుసన్నల్లో అక్రమ ఇసుక రవాణా..
- ఆపేదెవరు అడ్డుకునేది ఎవరు?
- కాకారవాణి వాగులో యతీయచ్ఛగా అక్రమ ఇసుక రవాణా..
- 10 ట్రాక్టర్లతో అర్ధరాత్రి వరకు అక్రమ ఇసుక రవాణా..






బొంరాస్ పేట్ మేజర్ న్యూస్ అక్టోబర్ (09 గురువారం) బొంరాస్ పేట్ మండలంలో అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్ట ఏది, యతెచ్చాగా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. మండల పరిధిలోని మాంతిపూర్ గ్రామ పరిధిలోని కాకారవాణి వాగు లో గత ఎనిమిది రోజులుగా యతేచ్చగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్న, పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు, అనే రీతిలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే యతెచ్చేగా బుధవారం ఉదయం నుండి,10 ట్రాక్టర్లతో అర్ధరాత్రి వరకు అక్రమ ఇసుక రవాణాకు తెర లేపారు. భారీగా వాగు నుండి ఇసుక తరలించి, జాన్కంపల్లి సమీపంలో చెరువు దగ్గర డంపు చేసి జెసిబి లా సహాయముతో టిప్పర్లలో లోడ్ చేసి పరిగి కొడంగల్ వికారాబాద్ తదితర ప్రాంతాలకు అర్ధరాత్రి వరకు తరలింపు కొనసాగుతుంది. ఉదయం నుండి రాత్రి వరకు ఇంత జరుగుతున్న, కనీసం కన్నెత్తి చూడని పోలీసులు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో పోలీసుల పనితీరు ఇలా ఉంటే, రాష్ట్రంలోని పోలీసుల పరిస్థితి ఇంకే విధంగా ఉంటుందని పోలీసు శాఖవ విమర్శలు వెలుగుతున్నాయి. స్థానిక పోలీసులకు భారీగా ముడుపులు అందుకోవడంతో, అటువైపు కనీసం కన్నెత్తి చూసే ధైర్యం లేదని పలువురు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. చట్టాన్ని గౌరవిస్తూ చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్ట వ్యతిరేక పనులకు పాల్పడడంతో సామాన్యులకు న్యాయం ఎక్కడ అంటూ పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు బాసు రియాక్షన్ ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## గృహిణి అదృశ్యం



జల్ పల్లి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08):గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. నల్గొండ జిల్లాకు చెందిన గజ్జల శ్రీకాంత్ రెడ్డి, తన భార్య పిల్లలతో కలిసి రెండు నెలల క్రితం తుక్కుగూడ ప్రాంతానికి వచ్చి, జీవనోపాధి కోసం లక్ష్మీ ఆసుపత్రి సమీపంలో క్రీ పాయింట్ నడుపుతున్నాడు. ఈ నెల 1న ఉదయం 7గంటలకు అతని భార్య గజ్జల సంధ్యారాణి (32) ఎల్లారెడ్డి గూడలో ఉంటున్న తన సోదరుడి ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్ కి వెళ్ళింది. అనంతరం అతని భార్య 3వ తారీకు ఉదయం 10గంటలకు అతనికి ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు సమాచారం ఇచ్చింది, కానీ రాలేదు. మళ్లీ 7వ తారీకు సాయంత్రం ఐదు గంటలకు అతని భార్య సంధ్యారాణి అతనికి ఫోన్ చేసి తాను తుక్కుగూడకు చేరుకున్నానని, కానీ ఇంటికి రాలేనని చెప్పి, కాల్ డిస్కనెక్ట్ చేసింది. ఆ తర్వాత శ్రీకాంత్ రెడ్డి తన భార్య మొబైల్ నెంబర్ కి కాల్ చేయగా, ఆమె కాల్ లిఫ్ట్ చేయలేదు. వెంటనే తన భార్య గురించి చుట్టుపక్కల ప్రాంతాలలో, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శ్రీకాంత్ రెడ్డి పహాడీ షరీఫ్ పోలీసులను ఆశ్రయించి, తన భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు చేయాలి

▶▶ హైకోర్టు తీర్పు ఎలా ఉన్నా.. ▶▶ ఇప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లే అమలు చేయాలి ▶▶ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలి

▶▶ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలిబాకీ కార్డులను ప్రజలకు చేరువ చేయాలి ▶▶ కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్0 8) : గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తాలు అన్నారు. పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్ లో ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. కార్య క్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లా డారు రాష్ట్రంలో ఏర్పడ్డ 22 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని తుంగం లో తొక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ బాకీ కార్డు కింద అన్ని వర్గాల ప్రజలకుబాకీ పడ్డ సొమ్మును వారి ఖాతాలో వెంటనే జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిళలకు ఇస్తామన్న 2500 పెన్షన్ వృద్ధులు వికలాంగులకు కుటుంబంలో ఉన్న భార్యాభర్తలకు ఇద్దరికీ ఇస్తామన్న పెన్షన్ వెంటనే ఇచ్చి పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఏ హామీ కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వారన్నారు. ఇప్పటివరకు రైతన్నలకు రుణమాఫీ కింద 12 వేల కోట్లు మాఫీ కాలేదని అన్నారు. విద్యా భరోసా కార్డు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలన్నిటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను అనేక రకాలుగా మోసం చేస్తున్నారన్నారు. మోసగాడి ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మూడుసార్లు మార్చి పెద్దలకు లాభం చేకూరే విధంగా చేశారని, సన్న చిన్న కారు రైతులు ఇబ్బందుల కు గురవుతున్నారని వివరించారు. మూడుసార్లు అలైన్మెంట్లు ఎందుకు మార్చారు ప్రజలకు చెప్పాలన్నారు. హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లైన్లుగా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన పనులే తప్ప ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక న్యాయ పైసా కూడా ఎత్తిపోతల పథకానికి కేటాయించలేదని జైపాల్ యాదవ్ విమర్శించారు. రాష్ట్రంలో 56% ఉన్న బీసీల జనాభా ప్రకారం రిజర్వే షన్లు అమలు చేయాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల్లో కాకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను జీవోల రూపకంగా కాకుండా చట్ట బద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల కు సంబంధించి బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల సమస్య హైకోర్టులో నడుస్తున్నదని హైకోర్టు తీర్పు ఎలా వచ్చినా ప్రస్తుతం అమలు చేస్తున్న రిజర్వేషన్లని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల నే పేర్లు మార్చి కొనసాగిస్తున్నారని కొత్తగా రైతులకు అన్ని వర్గాలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్రతి కులానికి డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలో లేరని వారికి స్థానిక సంస్థలు ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు. సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్ ఎన్ రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్ రావు, సయ్యద్ ఖలీల్, మాజీ సర్పంచ్ సోనా శ్రీను నాయక్, మాజీ ఎంపీటీసీ సరిత పంతు నాయక్, సత్యం, రఘు, నిరంజన్, సాయిలు, శంకర్, అశోక్, భీమయ్య, గణేష్, మహేష్, బాలరాజ్, నరేందర్, ప్రసాద్, గన్యా నాయక్, రమేష్, హాజీ పాషా, జంగయ్య,వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు , అభిమానులు, పాల్గొన్నారు.

# నల్లవారిపల్లి నుండి మాడ్గుల రోడ్ వరకు ఉయ్యాలో.. జంపాలో..!

▶▶ గోతులమయంగా మారిన రహదారిలో వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు ▶▶ అవురుపల్లి నుండి నల్లవారిపల్లికి బిటి నిర్మించినప్పటికి నల్లవారిపల్లి నుండి మాడ్గులకు వెళ్ళాలంటే గోతులమయమైన మట్టిరోడ్డులో ఇబ్బందులు తప్పడం లేదు ▶▶ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి సమస్య పరిష్కారానికి ప్రత్యేకచొరవచూపాలంటున్న స్థానికులు




మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08): మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామం నుండి ఆమనగల్లు–మాడ్గుల ప్రధాన రహదారికి చేరుకోవడానికి వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేండ్లుగా మట్టిరోడ్డుకే పరిమితమైన నల్లవారిపల్లి గ్రామస్థులకు 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అవురుపల్లి నుండి నల్లవారిపల్లి వరకు బిటి నిర్మాణానికి శంఖుస్థాపన చేసినప్పటికి ఎలాంటి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రస్తుత కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవచూపి అవురుపల్లి నుండి నల్లవారిపల్లి గ్రామం వరకు బిటిరోడ్డు నిర్మాణాన్ని ఇటీవలే పూర్తిచేయించారు. అయితే నల్లవారిపల్లి నుండి మాడ్గుల, మాల్, ఇబ్రహీంపట్నంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే ఈ గ్రామం నుండి సుమారు 2.5 కిలోమీటర్ల మట్టిరోడ్డును బిటిగా మార్చాల్సి వుంది. ప్రధానంగా గోతులమయంగా మారిన నల్లవారిపల్లి మట్టిరోడ్డులో నిత్యం రాకపోకలు సాగించే మహేశ్వరం ఆర్టీసి డిపోకు చెందిన బస్సులతో పాటు వివిధ వాహనాలు ఈ గోతులగుండా ప్రయాణిస్తుంటే ఆయా వాహనాల్లోని ప్రయాణీకులు ఉయ్యాలో.. జంపాలో అన్నరీతిలో ఊగిపోతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవచూపి నల్లవారిపల్లి నుండి మాడ్గుల డబుల్‌రోడ్డు వరకు సుమారు 2.5 కిలోమీటర్ల దూరం బిటిరోడ్డు మంజూరుచేయాలని గ్రామస్థులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

# అప్పారెడ్డిపల్లిలో పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08):మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటు సంభవించి అదే గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ కూలి మృతిచెందాడు. మాజీ సర్పంచ్ పల్లేటి జంగమ్మయాదయ్య, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అల్లి బుచ్చయ్య (50) అనే వ్యక్తి మాడ్గుల–అప్పారెడ్డిపల్లి రహదారి సమీపంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తూ పశువుల మేత కొరకు పచ్చిసొప్పను పొలంలోనుండి తెస్తుండగా పిడుగుపాటు సంభవించడంతో బుచ్చయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. పిడుగుపాటు విషయాన్ని మాడ్గుల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ నాగరాజుగౌడ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య పద్మమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిడుగుపాటుకు గురై అల్లి బుచ్చయ్య మృతిచెందడం పట్ల మాడ్గుల మాజీ జడ్‌పిటిసి గౌరవరం ప్రభాకర్‌రెడ్డి ఫోన్‌ద్వారా దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ పల్లేటి జంగమ్మయాదయ్య, గ్రామ మాజీ కోఆప్షన్ సభ్యులు కాస సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ఉడుతల వెంకటయ్యగౌడ్ తదితరులు మృతుడి కుటుంబీకులను ఓదార్చి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డిల సహకారంతో ప్రభుత్వపరంగా ఆదుకునేలా చూస్తామని భరోసానిచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు మాడ్గుల మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి అప్పారెడ్డిపల్లి గ్రామసమీపంలోని వ్యవసాయ పొలం వద్ద అల్లి బుచ్చయ్య (50) అనే కూలి పిడుగుపాటుకు గురై మృతిచెందినట్లు మాడ్గుల సి.ఐ వేణుగోపాల్ తెలిపారు. బుచ్చయ్య ఆవుల మేతకు అవసరమైన సొప్పను తీసుకుని వస్తుండగా పిడుగుపాటు సంభవించడంతో అతను అక్కడికక్కడే మృతిచెందడం జరిగిందని, మృతుడి భార్య అల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ తెలిపారు.

## న్యూ మధురానగర్‌లో పర్యటించిన ఏఐసీసీ కోఆర్డినేటర్ రాఘవేందర్ రెడ్డి



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 08):మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ న్యూ మధురానగర్ కాలనీలో ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యపై ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని, మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి శాంక్షన్ చేసిన పెండింగ్ పనులను కమిషనర్ సరస్వతి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పూర్తి చేస్తాం" అని ఎఐసిసి కోఆర్డినేటర్ బొయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, న్యూ మధురానగర్ కాలనీ అధ్యక్షుడు రామ్ రెడ్డి, సభ్యులు కుమార్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ....



శంకరపల్లి మేజర్ న్యూస్ (అక్టోబర్ 9) స్థానిక సంస్థల ఎన్నికల సంద ర్భంగా ఈనెల 9 నుండి 11వ తేదీ వరకు అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించబడతాయని శంకర్పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ అన్నారు. బుధవారం రోజున విలేకరులతో మాట్లాడుతూ ఈనెల జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జడ్పిటిసి మరియు ఎంపిటిసిగా ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు ఇవ్వవచ్చు అని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు మండల పరిషత్ కార్యాలయంలో అన్ని ఏర్పాటను పూర్తి చేసామని ఆయన తెలిపారు.

## సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థికి ఎంబిబిఎస్ సీటు

★ఎంబిబిఎస్ సీటు సాధించిన బిజెపి మండల ఉపాధ్యక్షులు కాటంగౌడ్ చిన్న కుమారుడికి పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయబృందం సత్కారం



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 08):మాడ్గుల మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన బిజెపి మండల ఉపాధ్యక్షులు ఎరుకలి కాటంగౌడ్, నాగమణి దంపతుల చిన్నకుమారుడు ఎరుకలి పృథ్వీరాజ్ మహబూబ్‌నగర్ వైద్యకళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించాడు. ఈ మేరకు తమ పాఠశాలలో నర్సరీ నుండి 10వ తరగతి వరకు చదువుకున్న పృథ్వీరాజ్ చిన్నతనం నుండే క్రమశిక్షణతో విద్యపట్ల మక్కువతో ముందుకు సాగి ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల కరస్పాండెంట్ బీజు, ప్రిన్సిపాల్ బీను, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బీను మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి, బిజెపి మండల ఉపాధ్యక్షులు కాటంగౌడ్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలనీలలో పార్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదే : కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : కాలనీలలో పార్కులను, రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం ఆయన మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని భ్రమరాంబికానగర్ శుభోదయం అపార్ట్మెంట్ వద్ద రూ 8 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ ప్యాచ్ పనులకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ జీహె చ్ఎంసి పరిధిలో నిధుల లేమి ఉండటంతో జీహెచ్ఎంసీ సమావేశాల లో మీ కాలనీల సమస్యలపై గళం విప్పి, కొట్లాడి నిధులు తీసుకుని వచ్చి ఆయా అభివృద్ధి పనులను చేపడుతున్నానని చెప్పారు. కాలనీలలో పార్కులను, రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనన్నా రు. ఈ పార్కులలో కొంతమంది వ్యక్తులు తప్ప తాగి మద్యం సీసాలను ఇష్టానుసారంగా పడేసి నానా చెండాలపు పనులు చేస్తు న్నారని వాపోయారు. ఇదే విషయమై కార్పొ రేటర్, కాలనీ వాసులతో కలిసి,ఎస్ఐ ఉపేం దర్ రెడ్డి కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆకతాయి లు పార్కులను పాడు చేస్తూ, తప్ప తాగి రోడ్లపై స్పీడుగా డ్రైవింగ్ చేస్తున్నా రని వీరి ఆగడాలను కంట్రోల్ చెయ్యడానికి పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని ఆయన కోరారు.